తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## డిఎంహెచ్‌ఓగా డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు..

**'వార్త' ప్రభావం**

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ ఎ.నాగ శశిభూషణ్‌రెడ్డిని మరోసారి నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణిని ఇక్కడి నుండి బదిలీ చేస్తూ కడప జిల్లా డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నాగ శశిభూషణ్‌ను చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమిస్తూ ఒక నెల రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఇక్కడ డిఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణి విధుల నుండి రిలీవ్ కాకపోవడంతో డిఎంహెచ్‌ఓగా నియమితులైన డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి ఇక్కడ విధుల్లో చేరని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఈ విషయంను 'ప్రభాతవార్త' ప్రచురించడంతో ప్రభుత్వ కార్యదర్శి మరోసారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ నాగ శశిభూషన్‌రెడ్డిని నియమిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది.

## గణనాధుని దర్శించుకున్న ఇంటలిజెన్స్ ఐజీ



కాణిపాకం, మార్చి 23 ప్రభాతవార్త: రాష్ట్ర ఇంటలిజెన్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆయనకు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఈఓ రవీంద్ర బాబు, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, ఇంటలిజెన్స్ సీఐ రాజశేఖర్, ఎస్సైలు త్యాగరాజన్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### చిత్తూరు కోర్టుకు

# మరోసారి బాంబు బెదిరింపు

- కోర్టులో 25 చిన్న సైనేడ్ గ్యాస్ బాంబులు పెట్టినట్లు కోర్టు సూపరిటెండెంట్‌కు మెయిల్
- పరుగులు తీస్తూ బయటికి పరిగెత్తిన లాయర్లు, కక్షిదారులు
- రంగంలోకి దిగి పోలీసు డాగ్‌స్క్వాడ్ విస్తృత తనిఖీ
- మరోసారి ఉత్తుత్తి బెదిరింపు అని తేల్చిన పోలీసులు
- ఊరిపి పీల్చుకున్న న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా కోర్టు సోమవారం మరొక్కసారి ఉలిక్కిపడింది. చిత్తూరు జిల్లా కోర్టు భవనాల్లో ఏకంగా 25 చిన్న సైనేడ్ గ్యాస్ బాంబులు పెట్టామని, ఈ బాంబులు ఎప్పుడైనా పేలవచ్చునని కోర్టు మెయిల్‌కు మెయిల్ రావడంతో కోర్టులో కలకలం రేగింది. కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు బాంబు బెదిరింపు మెయిల్ సమాచారం తెలుసుకుని ఒక్కసారిగా కోర్టునుండి వెలుపలికి పరిగెత్తారు. కోర్టు సూపరిటెండెంట్ కోర్టుకు వచ్చిన బాంబు బెదిరింపు సమాచారంను మధ్యాహ్నం 12.05 గంటలకు పోలీసులకు అందజేయడంతో పోలీసులు మధ్యాహ్నం 12.10 గంటలకు రంగంలోకి దిగారు. కోర్టుకు బాంబు బెదిరింపు సమాచారం అందుకున్న డిఎస్పీ సాయినాథ్ నేతృత్వంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మోతూరి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, ఆర్ఐ సుధాకర్‌లు తమ సిబ్బందితో కోర్టుకు చేరుకున్నారు. అప్పటికే డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందడంతో డాగ్ స్క్వాడ్ కోర్టుకు చేరుకుని బాంబు ఎక్కడ పెట్టారనే విషయంపై తనిఖీలు ప్రారంభించాయి. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మోతూరి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబులు కోర్టుకు చేరుకుని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులకు వెలుపలికి తరలించారు. ఆపై కోర్టు భవనాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అయితే డాగ్ స్క్వాడ్‌కు ఎక్కడా బాంబు పెట్టిన అనవాళ్ళు కన్పించలేదు. మధ్యాహ్నం 12.10 గంటల నుండి కోర్టులో తనిఖీలు ప్రారంభించిన పోలీసులు మధ్యాహ్నం 3 గంటల వరకు తనిఖీలు చేసినా బాంబు జాడ కన్పించలేదు.

**గతంలో జరిగినా బెదిరింపు దారులను పట్టుకోని పోలీసులు**

చిత్తూరు జిల్లా కోర్టుకు ఫిబ్రవరి నెలలో సైతం ఇదే తరహా ఈ-మెయిల్ బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టు అధికారులు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిందని పోలీసులకు సమాచారం అందించిన తక్షణమే పోలీసులు రంగంలోకి దిగి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కోర్టులో ఎక్కడ ఎలాంటి బాంబు లేదని నిర్ధారించారు. అయితే కోర్టు మెయిల్‌కు ఎవరు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ చేశారు! ఎందుకు చేశారు! వారి ఉద్దేశం ఏమిటి! అనే విషయాలను సమగ్రంగా విచారించలేదు. ఈ క్రమంలో మళ్ళీ ఒక నెల సైతం గడువక ముందే కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఈ సారి సైతం పోలీసులు హుటాహుటిన రంగంలో దిగారు. క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. కోర్టు భవనాలు, పరిసరాల్లో ఎక్కడా బాంబు లేదని తేల్చారు. అయితే కోర్టుకు ఈ బాంబు బెదిరింపులకు ఎవరు పాల్పడుతున్నారు! వీరు ఎక్కడి నుండి మెయిల్ చేస్తున్నారు! వీరి ఉద్దేశం ఏమిటి! కోర్టులో బాంబు పెట్టినట్లు బెదిరింపులకు పాల్పడితే వారికి కలిగే లాభం ఏమిటి! అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించాలి.

## రాత్రి చంద్రప్రభపై ఉదయం సూర్యప్రభపై కోదండరాముడు



తిరుపతి,మార్చి 23ప్రభాతవార్త: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై దేదీప్యమానంగా ప్రకాశించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. సూర్యుడు తేజోనిధి. సకలరోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటవల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఔషధాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. ఉదయం సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిచారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, భక్తులు పాల్గొన్నారు.

# ఆలయ భూములు ధారాదత్తం

## రెవెన్యూ లీల స్థానికుల గోల

**శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరునికి కోట్ల రూపాయల మడిమాన్యాలున్నాయి.ఆలయ ప్రహరీ గోడపక్కన రెవెన్యూ అధికారులు వెంకన్న ఆస్తుల నుంచి వెనుక ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎంచక్కా రూ.కోట్ల విలువ చేసే ఆస్తుల్ని ధారాదత్తం చేసినట్లు సమాచారం. అయితే ఈ వివాదాలకు సంబంధించి స్థానికులు ఓ వైపు ప్రజా వేదికల్లో ఫిర్యాదు చేస్తుంటే లెక్క చేయని రెవెన్యూ అధికారులు దారి ఇచ్చినట్లు సమాచారం. దాంతో రెవెన్యూ లీలలకు సంబంధించి ప్రతి సారి 'ప్రజావేదికలో' మొరబెట్టుకుంటూనే ఉన్నారు. వీళ్ళు పట్టంచుకోరని సరాసరి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే ఫిర్యాదు చేసారు. అయినా చలనం లేదు.**

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తిరూరల్)

శ్రీకాళహస్తి మండలం ఎగువ,దిగువవీధి పంచాయతీ పరిధిలోని తొండమాన్‌పురం ఉంది, ఇక్కడ చారిత్రక ప్రసిద్ధి చెందిన టిటిడి కి అనుబంధంగా ఉన్న వైష్ణవాలయం ఉంది.ఇక్కడ వెలసిన వెంకటేశ్వరస్వామి ప్రసన్న వదనుడై శ్రీదేవి,భూదేవి సమేతంగా కూర్చొని దర్శనమిస్తున్నారు. తొండమాన్ చక్రవర్తిచే నిర్మించిన ఈ ఆలయానికి రాజులు మడి మన్యాలను కేటాయించారు.ఈ నేపథ్యంలో ఆలయ భూముల నుంచి వెనుక ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రూ.కోట్లు విలువ చేసే భూముల్లోంచి రోడ్డు సదుపాయం కల్పించటం చర్చనీయాంశంగా మారింది.

ఆలయ భూముల వివరాలు

ఆలయం బయట ప్రహారి గోడ పక్కన చుట్టూ సర్వే నెంబర్ 165/1లో 2.98 ఎకరాలు,165/3లో 3.96 ఎకరాలు,రెడ్డిగుంట 6.56 ఎకరాలు,తొమాల మాన్యం 10 ఎకరాలు ఉన్నట్లు రికార్డులున్నాయి. కాగా ఆలయానికి సంబంధించి 162 సర్వే నెంబర్‌లో భూములున్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. 162/2లో కోటగట్లు, ఆగర్తాలు వెరసి 34 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి.కోట గట్టు 165/3లో 3.68 ఎకరాలను టూరిజం శాఖకు అప్పగించారు.ఇందులో సుమారు రూ.15కోట్లు విలువ చేసే 1.5 ఎకరాల భూములను రెవెన్యూ శాఖ కలెక్టర్‌కు తెలియకుండానే వెనుక ఉన్న ప్రైవేటు వ్యక్తుల భూముల్లోకి సిమెంటురోడ్డు నిర్మాణానికి అవకాశం కల్పించారు.ఇక వెనుక ఉన్న ప్రైవేటు వ్యక్తుల భూములు 166/1లో 1.17 ఎకరాలని ఫెయిర్ అడంగల్‌లో ఉండగా సరాసరి 4.64 ఎకరాలు ఉన్నట్లు రికార్డులను రెవెన్యూశాఖ సృష్టించినట్లు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.అలాగే 166/21లో సతాను భూములుగా ఉన్నాయి,ఈ భూముల్లో వచ్చే ఆదాయంతో కొంతకాలం అర్చకులు ఆలయానికిధూప నైవేద్యాలను నిర్వహించినట్లు గత తరం చెబుతున్నారు. ఇక 167/4లో టిటిడి కళ్యాణమండపాన్ని నిర్మించారు. కాగా 167/3లో 14.83 ఎకరాల భూమి అగర్తాలగా ఉంది.

**పలు మార్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు:**

దేవుని భూములను కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులంగాయి. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.దిగువ వీధి గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 162/2 పురాతన చరిత్ర కల్గిన తొండమాన్ చక్రవర్తి నిర్మించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించి దానిని టిటిడి



ఆలయ భూముల ఆవరణలో నిర్మించిన సిమెంటు, ఆలయ పరిసరాల స్కెచ్

దేవస్తానంకు అప్పగించారు. టిటిడి ఇక్కడ నిత్యనైవేద్య నైమిత్తములను నిర్వహిస్తున్నారు.ఆ ఆలయానికి సంబంధించి కోటగట్లు,అగర్తాలుగా, రెడ్డి గుంటలున్నాయని వాటిని కాపాడాలని 'ప్రజా వేదిక' స్పందన కార్యక్రమాల్లో 07.04.2025లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు.ఆ అర్జీని పరిశీలించుటకు 70 రోజుల సమయం కోరి తరువాత ఓ ప్రవేటు వ్యక్తికి 26.04.2025న కన్వర్షన్‌కు దారి లేని భూములకు దారి అవకాశం కల్పించారు. కలెక్టర్ ఖాతాలో ఉన్న భూములను కలెక్టర్ ఉత్తర్వులు లేకుండా గ్రామ సర్పంచ్ అనుమతిచ్చిన మేరకు ఆర్‌డిఓ ధారాదత్తం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.మళ్ళీ గ్రామానికి చెందిన వ్యక్తి స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు 30.06.2025న ఫిర్యాదు చేస్తూ తనకేమో తన అర్జీ మీద విచారణకు 70రోజుల వ్యవధి కోరిన రెవెన్యూ శాఖ ప్రైవేటు వ్యక్తికి ధారాదత్తం చేసారు. ఈ అంశానికి సంబంధించి 24.11.2025న స్పందనలో మరో సారి కలెక్టర్‌కు అందించారు.

**ప్రజావేదిక,స్పందన ఎందుకు?**

ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో రెవెన్యూ సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కరించాలనే మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసింది. అయితే ఈ వేదికల్లో అందుతున్న సమస్యలను ఎంత వరకు పరిష్కరింపబడుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు నిదర్శనం తొండమనాడు భూముల వివాదాలు. సాక్షాత్తు కలెక్టర్ ఖాతాలో ఉన్న భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులుది కాదా? మరి ఎందుకు ఫిర్యాదు అందిన తరువాత ఈ భూములకు కన్వెర్షన్ ఇచ్చారు. రెవెన్యూశాఖపై ఎవరి వత్తిడి అయినా పడిందా? లేక ఫిర్యాదుల మీద లెక్కలేని తనమా? అనే విమర్శలు చోటు చేసుకున్నాయి.ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, కలెక్టర్ స్పందించి కలియుగ దైవం ఆస్తుల్ని పరిరక్షిస్తారో లేక ఏ ముందలే అంటూ గాలికి వదలిపెడతారో వేచి చూడాలి!

**(రేపటి సంచికలో టిటిడి ఎందుకు స్పందించటం లేదు?)**

## పరిష్కరించదగ్గ సమస్యలకు సత్వర పరిష్కారం

### - అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త: ప్రజల నుండి అందిన సమస్యల్లో పరిష్కరించదగ్గ సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్, డిఆర్‌ఓ మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్లు కరుణకుమారి, సురేష్‌లు, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం కన్పించాలని, గడువు ముగిసేలోపు అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 294 అర్జీలు

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు



తిరుపతి కలెక్టరేట్, మార్చి 23 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా జాయింట్ కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు.



దొమ్మెట్టి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, డీఆర్ఓ నరసింహులు, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

## ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి



చిట్వేలి, మార్చి 23, ప్రభాతవార్త :
గల్ఫ్ దేశాల యుద్ధం వల్ల మన దేశ వ్యవసాయ రంగ ఎగుమతులు నిలిచిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. సోమవారం చిట్వేలి మండలం వెంకటరాజు పల్లిలో మలిశెట్టి జతిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ ఆసియాకు భారతదేశం నుంచి దాదాపు లక్ష కోట్లు రూపాయలు విలువగల వ్యవసాయం,ఉద్యానవన పంటలు ఎగుమతి అయ్యేవని,ఈ యుద్ధం కారణంగా ఎగుమతులు నిలిచిపోవడంతో రైతులు ఆర్థికంగా పూర్తిగా దెబ్బతినే పరిస్థితి కలిగిందని అన్నారు.యుద్ధం త్వరగా ముగిసిపోవాలని కోరుకుంటున్నాని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ యుద్ధం వల్ల రైతులు ఎంతో నష్టపోతున్నారని, కాబట్టి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి రైతులకు యుద్ధం నిలిచి సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు,తగిన ఆర్థిక భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి రాహుల్, విజయభాస్కర్, బచ్చు రామచంద్ర, నారాయణ, వెంకటసుబ్బయ్య, మణి, నరసింహ, నాగేశ్వర్ లు పాల్గొన్నారు.

# చిత్తూరు రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసిబి దాడి

### - తప్పించుకున్న ఒక రిజిస్ట్రార్

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:
చిత్తూరు గిరింపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-1పై సోమవారం ఏసిబి అధికారులు పంజా విసిరారు. చిత్తూరు గిరింపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం-1పై ఏసిబికి అవినీతిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్ళడంతో అవినీతి నిరోధకశాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా కార్యాలయంపై దాడి చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి ఏసిబి అధికారులు ప్రవేశించారనే సమాచారం తెలిసిన వెంటనే ఇన్‌ఛార్జీ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్ కార్యాలయం నుండి ఏసిబి అధికారుల కన్నుగప్పి తప్పించుకున్నారు. అయితే సబ్ రిజిస్ట్రార్ రమణరావుతో పాటు ఇసి సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మేనక, కంప్యూటర్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న గాంధీ, మేరేజ్ సర్టిఫికేట్లు జారీ చేసే రాంప్రసాద్‌లు ఏసిబి అధికారులకు చిక్కారు. ఏసిబి ఎస్పీ విమల ఆధ్వర్యంలో ఏసిబి డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి చేయడంతో ఇక్కడ పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని ఏసిబి అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.




ఏసిబి అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించిన వెంటనే కార్యాలయ తలుపులు మూసి వేసి కార్యాలయం నుండి ఎవ్వరు బయటికి వెళ్లకుండా కట్టడి చేశారు. అప్పటికే కార్యాలయంలో విధులు నిర్వర్తించే కొంతమంది జారుకున్నట్లు సమాచారం. అయితే ఏసిబి అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించినపుడు పలువురు స్టాంప్ వెండర్లతో పాటు డాక్యుమెంట్ రైటర్లు వుండటంతో వారిని సైతం ఏసిబి అధికారులు బయటికి వెళ్ళకుండా అక్కడే వుండాలని స్పష్టం చేశారు. చిత్తూరు గిరింపేట రిజిస్ట్రార్ కార్యాలయం-1లో పెద్ద ఎత్తున అవినీతి కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలు వున్నాయి. గతంలో సైతం ఈ కార్యాలయంపై ఏసిబి అధికారులు దాడులు నిర్వహించి సబ్ రిజిస్ట్రార్ వద్ద నుండి పెద్ద ఎత్తున అనధికారిక నగదు స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ ఈ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు తమ పనితీరు మార్చుకోలేదు. ఈ పరిస్థితుల్లో మళ్ళీ ఏసిబి అధికారులకు చిత్తూరు గిరింపేట రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతిపై ఫిర్యాదులు అందడంతో ఏసిసి అదికారులు, సిబ్బంది సోమవారం పెద్ద ఎత్తున ఒక్కసారిగా కార్యాలయంపై దాడి చేసి రికార్డులు స్వాధీనం చేసుకుని విస్తృతంగా విచారిస్తున్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా టీడీపీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి

వడమాలపేట, మార్చి 23 ప్రభాతవార్త:
రైతును రాజులుగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వడమాలపేట మండలం తిరుమణ్యం పంచాయతీలో వ్యవసాయ అధికారులతో కలసి రైతన్న వద్దకే ప్రభుత్వం లాభసాటి వ్యవసాయమే లక్ష్యమ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రైతన్నలకు గొప్పవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముగంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల వద్దకే ప్రభుత్వం వెళ్లి లాభసాటి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తోందన్నారు. రైతు సంక్షేమమే పరమావధిగా చంద్రన్న నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. సాంకేతికతను జోడించి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వ సబ్సిడీ మద్దతు అనే పంచసూత్రాల అమలుతో రాష్ట్రవ్యవసాయానికి కొత్త ఊపిరి పోస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని 62 శాతం జనాభా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ధనంజయలునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దాము, మండల ప్రధాన కార్యదర్శి శివరాయల్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సుబ్రహ్మణ్యంరాజు, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌బీఆర్ పురం సర్పంచ్ మణిరాజు, సదాశివకోన చైర్మన్ శ్రీధర్‌రాజు, మునిరాజు, జ్యోతిరెడ్డి, కుమార్, ఉమాపతి, దేవా నాయుడు, వినోద్, సురేష్, చైతన్య, ధనంజయలు, లక్ష్మిప్రసాద్, సురేష్, మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, పంచాయతీ కార్యదర్శి లోకముని పాల్గొన్నారు.



## పారదర్శకంగా జనగణన-2027 నిర్వహణ: కలెక్టర్



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:
జిల్లాలో జనగణన-2027 పారదర్శకంగా నిర్వహించి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం జనగణన-2027 కార్యక్రమం అమలులో భాగంగా ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమంను కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్ర మానికి కుప్పం, పలమనేరు, నగరి డివిజన్ల పరిధిలోని ఫీల్డ్ ట్రైనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో కొనసాగుతుందని, మొదటి దశలో హౌస్ లిస్టింగ్ అండ్ హౌసెస్ సెన్సెస్ లేఅవుట్ మ్యాపింగ్ కాగా రెండవ దశలో జనగణన జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో మొదటి దశలో భాగంగా గృహ నమోదు ప్రక్రియ ఎలా చేపట్టాలన్న అంశంపై సోమవారం నుండి మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల మంగళగిరిలో ఎపి హెచ్‌ఆర్‌డిలో జిల్లాకు సంబంధించిన అధ్యాపకులు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన నేపథ్యంలో వీరు జిల్లా కేంద్రంలో జనగణన అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ప్రస్తుతం ఇక్కడ శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులకు జనగణన ప్రక్రియపై అవగాహన కల్పిస్తారన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా శిక్షణా తరగతులు పూర్తి చేయాలని కలెక్టర్ శాఖల ఉన్నత అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి బి.మునిచంద్ర, డాక్టర్ ఎ. హేమలతలు మాస్టర్ ట్రైనర్స్‌గా వ్యవహరించారు. అలాగే 34 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి, సర్వశిక్షాభియన్ ఎపిసి వెంకటరమణ, కలెక్టరేట్ సూపరిటెండెంట్ పద్మజలు హాజరయ్యారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 28 సమస్యలు



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో జరిగిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు ఈ వారం ప్రజల నుండి సమస్యలపై 28 అర్జీలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను చట్ట ప్రకారం విచారించి నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ తుషార్ డూడి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు ఆపరేషన్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్‌ఆర్ రాజశేఖర్‌రాజు, డిటిడిసి డిఎస్పీ రాంబాబులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సమస్యలపై మొత్తం 28 అర్జీలు అందగా అందులో చీటింగ్‌కు సంబంధించి 6, భూతగాదాలు 6, కుటుంబ తగాదాలు 5, పోలీసు సేవలు 3, దారి సమస్యలు 2, డబ్బు లావాదేవిలు 2, ఆస్తి తగాదాలు2, వేధింపులు, చిన్న గొడవలకు సంబంధించి ఒకొక్క సమస్య అందాయి.

## 27న కాణిపాకంలో శ్రీరామనవమి వేడుకలు

కాణిపాకం, మార్చి 23 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం దేవస్థానంలో ఈనెల 27న శ్రీరామనవమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈమేరకు ఈమేరకు ప్రధాన ఆలయ ప్రాంగణలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించనున న్నట్లు తెలిపారు. ఈమేరకు శ్రీసీతా రాముల ఉత్సవ మూర్తులకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపం వద్ద కళ్యాణవేదికపై 11.57 గంటల నుండి 12.46 గంటల లోపు శుభ అభిజిత్ లగ్నమందు శ్రీసీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కళ్యాణోత్సవం జరిపించదలచుకున్న భక్తులు 300 రూపాయలు చెల్లించి టిక్కెట్ పొంది కళ్యాణోత్సవంలో పాల్గొనాలని ఈఓ తెలిపారు.

## రేపు కుప్పంలో మెగా జాబ్ మేళా

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:
రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా కార్యక్రమంలో 33 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని, టెన్త్, ఇంటర్మీడియేట్, ఐటిఐ, డిగ్రీ, బిటెక్, బిఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరు కావడానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 18-35 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీ, పురుష అభ్యర్థులు పాల్గొనవచ్చునని, ఈ జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.13 వేల నుండి రూ.36 వేల వరకు వేతనం లభిస్తుందన్నారు. అభ్యర్థులు తమ వెంట విద్యార్హత సర్టిఫికేట్ల జెరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, బయోడేటా తీసుకురావాల్సి వుంటుందన్నారు. వివరాలకు ధర్మేంద్ర ఫోన్‌నెం.94939 03896, తరుణ్ ఫోన్‌నెం.63033 28587, రాజా ఫోన్‌నెం.90525 07933లను సంప్రదించాలని తెలిపారు.

## వేగంగా సమస్యల పరిష్కారానికి చర్యలు
### - మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన వినతులను క్షేత్ర స్థాయిలో పక్కాగా పరిశీలించి వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 8 సమస్యలు అందాయి. ఇందులో రెవెన్యూ విభాగంకు సంబంధించి 3, టిడ్కో ఇళ్లకు సంబంధించి 2, ఇంజనీరింగ్, మున్సిపల్ కార్యాలయం, పెన్షన్లకు సంబంధించి ఒకొక్క సమస్య అందాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ పార్కింగ్ టెండర్ గడువు పెంపు
### - కలెక్టర్‌ను కలిసి విన్నవించిన కాంగ్రెస్ నాయకులు



చిత్తూరుహెల్త్, మార్చి 23 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే పార్కింగ్ టెండర్ గడువు మరో మూడు రోజుల పాటు పొడిగించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి విన్నవించారు, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కి రాయల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు వెళ్ళి కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌తో మాట్లాడుతూ వరుసగా మూడు రోజుల పాటు సెలవు రోజులు రావడంతో టెండర్లు దాఖలు చేయాలనుకొనే వారు బ్యాంకుల్లో డిడిలు తీయడానికి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మరో మూడు రోజుల పాటు గడువు ఇస్తే కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి వచ్చే ఆదాయం పెరిగే అవకాశం వుంటుందన్నారు. ఈ అంశంపై పరిశీలిస్తానని కలెక్టర్ కాంగ్రెస్ నాయకులతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి ఉపాధ్యక్షుడు లోకేష్‌బాబు, మాజీ పిసిసి సెక్రటరీ పరదేశి, మాజీ ఓబిసీ సెల్ ఉపాధ్యక్షులు పూర్ణచంద్ర, గుడిపాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షణ్ముగం, చిత్తూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయలో ఈ ఏడాది నుంచే తరగతులు
### - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పానికి కేంద్రం మంజూరు చేసిన కేంద్రీయ విద్యాలయలో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు మొదలవుతాయని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం ద్రవిడ విశ్వవిద్యాలయం పెరియార్ భవన్‌లో ఏర్పాటుచేస్తున్న తాత్కాలిక తరగతి గదులను ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పరిశీలించారు. ఈసందర్భంగా ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ భవనాలను శాశ్వతంగా బైరుగానిపల్లి వద్ద ఐదు ఎకరాల్లో నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటుచేస్తున్న తాత్కాలిక భవనాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. పాఠశాల ప్రారంభంకు ముందే అన్ని పనులు పూర్తయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ దివాకర్, పిఆర్ డిఇ గురవారెడ్డి పాల్గొన్నారు.

## కేంద్రమాజీ మంత్రిని కలసిన కెఇసి వైస్‌ఛైర్మన్

కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త



కేంద్ర మాజీ కమ్యూనికేషన్స్, ఐటి శాఖ మంత్రి, ఎంపి రవిశంకర్ ప్రసాద్‌ను కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. న్యూఢిల్లీలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన కలిశారు. ఈసందర్భంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ సాంకేతిక విద్యారంగంలో 25 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసినందుకు రవిశంకర్ ప్రసాద్ అభినందించారు. అలాగే 2015నుంచి కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో చదువుతున్న బీహార్ విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్ పథకం గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు.

## వాఫ్ బక్రీ సంస్థచే అక్షయపాత్రకు వాహనాలు వితరణ



కుప్పం,మార్చి 23 ప్రభాతవార్త
వాఫ్ బక్రీ గ్రూప్ అధ్వర్యంలో కుప్పంలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఎనిమిది ఆహార పంపిణీ వాహనాలను వితరణగా అందజేశారు. కార్పోరేట్ సంస్థల సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ వాహనాలను వాఫ్ బక్రీ గ్రూప్ ఇడి పరాస్ దేశాయి మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్‌తో తమ భాగస్వామ్యంను మరింత బలపరచడం జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్‌లో సిఎస్‌ఆర్ ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అక్షయపా త్ర ఫౌండేషన్ ఎపి, తెలంగాణా అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభుజీ, సిబ్బంది పాల్గొన్నారు.

## నారా భువనమ్మ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మంగళవారం కుప్పం మండలంలో పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో మండలంలోని మంకలదొడ్డి గ్రామంలో మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఈకార్యక్రమంకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మంకలదొడ్డి గ్రామంలో పరిశీలించారు. నేతలకు ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, రెస్కో డైరెక్టర్ మురళి, నేతలు ఎవి రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర
### - సర్పంచ్ చొరవతో ఏళ్లనాటి నీటి సమస్య పరిష్కారం !!

కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త



ఆ గ్రామంలో ఉండేవి ఆరేడు కుటుంబాలు.. ఏళ్ల తరబడి ఆ కుటుంబాల వారు మంచినీటి కోసం ఇబ్బందులు పడేవారు.. ఒకటిన్నర కిలోమీటరు దూరం నుంచి నీళ్లు తెచ్చుకునేవారు. ఈ సమస్యకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పంచాయతీ సర్పంచ్ చొరవ చూపి గ్రామస్తుల ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరవేసి గ్రామస్తుల కోరికను పరిష్కరించారు. మండలంలోని కొటాలూరు గ్రామ పంచాయతీ తమిళనాడు సరిహద్దుల్లో ఉంది. ఈపంచాయతీలో బూదగుంట చేను గ్రామంలో సుమారు ఆరేడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరు దాదాపు యాభై ఏళ్లుగా మంచినీటి కోసం ఒకటిన్నర కిలోమీటరు దూరం నుంచి మంచినీటిని తీసుకుని వచ్చేవారు. అయితే ఈ ఏళ్లనాటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ రాజే ంద్రన్ చొరవ చూపారు. త్రాగునీటి బోరు డ్రిల్ చేయించడంతో పాటు గ్రామానికి కొత్తగా పైపులైను ఏర్పాటుచేశారు. దీంతో గ్రామస్తులకు తాగునీరు అందుతోంది. గ్రామస్తులు ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు, సర్పంచ్ రాజేంద్రన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజేంద్రన్ 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. యాభై ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రజలకు నీళ్లు అందించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పంచాయతీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్, సంజీవరాజులునాయుడు, పొన్నువేలు, పంచాయతీ కార్యదర్శి మంజునాథ్ పాల్గొనా న్నరు.

## 26న కాణిపాకం ఆలయంలో హుండీల లెక్కింపు

కాణిపాకం, మార్చి 23 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 26న హుండీల కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఉతయం 7 గంటలకు స్థానిక ఆస్థాన మండపంలో యూనియన్ బ్యాంకు వారిచే జరిగే హుండీ లెక్కింపుకు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని సూచించారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## మృతి చెందిన ఎఎస్ఐ కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందజేసిన ఎస్పీ



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:
చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఎఎస్ఐ మనోహరన్ సతీమణి భారతికి ఎస్పీ తుషార్ డూడి సోమవారం ఐడిఆర్‌ఎఫ్ ఫండ్ నుండి 1 లక్ష రూపాయల చెక్కును అందజేశారు. జిల్లా సాయుధదళ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలను మృతి చెందిన ఎఎస్ఐ మనోహరన్ కుటుంబానికి అందిస్తామని, అలాగే ప్రభుత్వం అందించే న్యాయమైన సౌకర్యాలను పొందడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్‌ఆర్ రాజశేఖర్‌రాజు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యలో నిరంతర క్రమశిక్షణ, నిరంతర శ్రమ కీలకం
### - అపోలో యూనివర్శిటీ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె. అగస్టీన్



చిత్తూరుహెల్త్, మార్చి 23 ప్రభాతవార్త:
వైద్య విద్యలో కృషి, క్రమశిక్షణ, నిరంతర శ్రమ అత్యంత కీలకమని అపోలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.అగస్టిన్ పేర్కొన్నారు. మురకంబట్టు అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో సోమవారం ఎంబిబిఎస్-2022 బ్యాచ్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. వైద్య విద్యలో చివరి దశలో అడుగుపెడుతున్న విద్యార్థులకు అకాడెమిక్ నిర్మాణం, క్లినికల్ అనుభవం, ప్రొఫెషనల్ అభివృద్ధిపై సమగ్ర మార్గదర్శకత్వం అందించడానికి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీన్ అల్ఫ్రెడ్ జె.అగస్టిన్ మాట్లాడుతూ విద్యార్థులు షార్ట్‌కట్‌లు ఆశ్రయించకుండా పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. పరీక్షలను ఒత్తిడిగా కాకుండా సమతుల్య దృక్పథంతో ఎదుర్కొని ఒత్తిడిని అధికమించాలన్నారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే విద్యా లేక వ్యక్తిగత సమస్యలపై డిప్యూటీ డైరెక్టర్(స్టూడెంట్ ఆఫైర్స్), విభాగాధిపతులు, అసోసియేట్ డీన్, డీన్‌లను నిరభ్యంతరంగా సంప్రదించాలన్నారు. తక్కువ ప్రొఫైల్‌లో వుండి ఉన్నత ప్రదర్శన చేయాలని, సానుకూల, ఆనందదాయకమైన అభ్యాసన వాతావరణంను ఏర్పరచుకోవాలని సూచించారు. 2020 బ్యాచ్ ఉత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థి చరణ్ సెంథిల్ తన అనుభవాలను పంచుకుని క్రమశిక్షణ, సమయ నిర్వహణతో విజయం సాధించవచ్చునని ప్రేరేపించారు. ఈ కార్యక్రమంను డిప్యూటీ డైరెక్టర్/స్టూడెంట్ ఆఫైర్స్) డాక్టర్ శ్రావణ దీప్తి సమన్వయం చేయగా విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎంబిబిఎస్ ఫైనల్ ఇయన విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలి



శాంతిపురం, మార్చి 23 ప్రభాతవార్త
టువీలర్ నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించాలని రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ సూచించారు. మంగళవారం కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో ప్రయాణీకులకు హెల్మెట్ ధారణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడంతో పాటు వాహనాలు నిర్ణీతవేగంతో మాత్రమే నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే
### - టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్



శాంతిపురం, మార్చి 23 ప్రభాతవార్త
గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చెంగుబల్ల పంచాయతీ సోగడబళ్ల ఎస్సీ కాలనీనుంచి స్మశాన వాటికకు నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గత నలభై ఏళ్లుగా స్మశాన వాటికకు దారి సమస్య ఉండగా ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టారన్నారు. రోడ్డు నిర్మాణంకు ఆరు లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో నేతలు రమేష్, మంజునాథ్, చంద్రశేఖర్, చంద్రశేఖర్, లోకేష్, మంజునాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా బస్తాలు పంపిణీ

శాంతిపురం, మార్చి 23 ప్రభాతవార్త
మండలంలోని చిన్నారిదొడ్డి రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, రెస్కో డైరెక్టర్ శరణ్‌కుమార్, పంచాయతీ టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## చింతకుప్పం వద్ద కారు బోల్తా

రామకుప్పం, మార్చి 23 ప్రభాతవార్త
మండలంలోని చింతకుప్పం సమీపంలో కారు బోల్తా పడింది. మదనపల్లిలో బిటెక్ చదువుతున్న విద్యార్థులు నలుగురు కారులో విహారయాత్రకు రాగా మార్గ మధ్యంలో చింతకుప్పం వద్ద ఓ శునకం కారుకు అడ్డు రాగా కారు అదుపు తప్పి బోల్తాపడింది. కారులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు

## -కమిషనర్ మౌర్య




తిరుపతి,మార్చి 23ప్రభాతవార్త:

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 26 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 13 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా ఐ ఎస్ మహల్ వద్ద గల తుడా అపార్ట్మెంట్ కామన్ ఏరియా ను ఆక్రమించి గుడి నిర్మిస్తున్నారని, వర్షాలు వస్తే గాయత్రి నగర్, శ్రీకృష్ణ నగర్ లో ఒక అడుగు లోతు నీరు నిలుస్తున్నాయి రోడ్లు వేయించాలని, ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉంది చర్యలు తీసుకోవాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, మహిళా యూనివర్సిటీ వద్ద మా స్థలం లో వేరేవాళ్ళు అక్రమ నిర్మాణం చేస్తున్నారు ఆపాలని, రాజీవ్ గాంధీ కాలనీ లోని కనికలమ్మ గుడి వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం అడ్డుకోవాలని, అమెరికన్ బార్ సమీపంలో ఉన్న మటన్ దుకాణం వద్ద రోడ్డుపై రక్తం పడడంతో ఇబ్బందిగా ఉంది చర్యలు తీసుకోవాలని, మల్లయ్య గుంట వద్ద పారిశుద్ధం మెరుగ్గా చేపట్టాలని, యర్రమిట్టలో కుక్కల సమస్య పరిష్కరించాలని, యూడీఎస్ ఓవర్ ఫ్లో ను అరికట్టాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

### 50 మంది వినియోగదారులు

# విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు

## -ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి..



తిరుపతి,మార్చి 23ప్రభాతవార్త:

సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 50 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కార్పొరేట్ ఆఫీసులో సోమవారం ఉదయం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థకు నష్టం కలిగించే ఇటువంటి చర్యలను ఉపేక్షి ంచబోమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

### యువ కవి గొంతుకకు వేదిక..




# నేను దొరికానా మీకు" ఆవిష్కరణ

తిరుపతి విద్య మార్చి 23 ప్రభాతవార్త

సాధారణ విద్యార్థి నుంచి సాహిత్య ప్రపంచంలో అడుగుపెట్టిన యువకుడి ప్రయాణానికి ఎస్వీయూ వేదిక అయింది. తెలుగు విభాగంలో పీజీ పూర్తి చేసి ప్రస్తుతం బీఈడీ చదువుతున్న వి. మహేష్ రచించిననేను దొరికానా మీకు" కవితా సంపుటి సోమవారం ఘనంగా ఆవిష్కరించబడింది. సైకాలజీ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమం ఒక సాధారణ పుస్తకావిష్కరణ కాకుండా యువ రచయిత ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.ద్రావిడ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య మధుజ్యోతి, ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ఆచార్య రాజేశ్వరమ్మ వంటి ప్రముఖులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించడం విశేషం. వేమన విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు మల్లారపు నాగార్జున, డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి కూడా ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారు మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న సాహిత్య ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి వేదికలు అవసరమని చెప్పారు.మహేష్ కవిత్వం వ్యక్తిగత భావోద్వేగాలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న సంఘటనలను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కవితలు యువతలో ఆలోచన రేకెత్తించే శక్తి కలిగివున్నాయని తెలిపారు. ఒక విద్యార్థి స్థాయి నుంచి సమాజంపై స్పందించే కవిగా ఎదగడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, విద్యార్థి నాయకులు మాధవకృష్ణ, అక్బర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ఆవిష్కరణ



యువ రచయితలకు ప్రేరణగా నిలిచింది.

# పదవ తరగతి టాపర్లకు ఘన సత్కారం

తిరుపతి విద్య మార్చి 23 ప్రభాతవార్త

స్థానిక యశోధనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ వార్షికోత్సవం సోమవారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 202425 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. హేమశ్వరూప్, పోగూరి వికాస్, భవజ్ఞా, మద్దిపట్ల గురుదత్ నాయుడు తమ ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకున్నారు.వారి విజయాన్ని గుర్తిస్తూ పాఠశాల యాజమాన్యం మెమెంటోలు, నగదు బహుమతులను అందజేసింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ కష్టపడి చదివే విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని తెలిపారు. ఈ

### చిన్నారుల భవిష్యత్తుకు బలమైన బాట..

# ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ



తిరుపతి విద్య, మార్చి 23 ప్రభాతవార్త

చిన్నారుల విద్యలో పునాది బలంగా ఉండాలంటే ఉపాధ్యాయుల పాత్ర కీలకమనే భావనతో ఎస్వీయూ గృహ విజ్ఞాన విభాగం ముందుకొచ్చింది. రూసా 2.0 సహకారంతో"ఎమర్జెంట్ లిటరసీ, న్యూమరసీ" అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సెనేట్ హాల్లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని వీసీ టాటా నర్సింగరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం విశేషం.ప్రీస్కూల్, అంగన్వాడీ ఉపాధ్యాయులు, పరిశోధకులు పాల్గొన్న ఈ శిక్షణలో చిన్నారుల మౌలిక అభ్యాసాలపై ప్రత్యేక దృష్టి సారించారు. చిన్న వయసులోనే పిల్లలకు పాటలు, అంకెలు, రంగులు, ఆకారాలపై అవగాహన కల్పించడం ఎంత ముఖ్యమో వివరించారు. చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు ఎలా అభివృద్ధి చేయాలో శిక్షణ ఇచ్చారు.వీసీ మాట్లాడుతూ భారత్‌లో యువత సంఖ్య ఎక్కువగా ఉండటం దేశానికి ఒక బలమని తెలిపారు. ఆ బలాన్ని సక్రమంగా ఉపయోగించాలంటే చిన్నప్పటి నుంచే సరైన మార్గదర్శకం అవసరమన్నారు. ఉపాధ్యాయులు కొత్త పద్ధతులను నేర్చుకుని వాటిని పిల్లల అభ్యాసంలో అమలు చేయాలని సూచించారు.అలాగే ప్రీస్కూల్ టీచర్లు, అంగన్వాడీ సిబ్బంది, పరిశోధక విద్యార్థులు కూడా హాజరై శిక్షణను ఉపయోగించుకున్నారు. ఈ శిక్షణ చిన్నారుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకంగా మారనుంది.ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఓవీఎస్ఆర్రెడ్డి, విభాగాధిపతి ప్రొఫెసర్ కేవీ సుచరిత, కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ అనురాధ, డాక్టర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

# క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

## - శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు



తిరుపతి క్రీడ, మార్చి 23, ప్రభాతవార్త

క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు క్రీడలకు సంబంధించి క్రీడాభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎన్. శశిధర్, అసోసియేషన్ల సంఘాలకు సంబంధించిన కార్యదర్శులు, జిల్లా కబడి సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీధర్, ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి బాలాజీ, వాలీబాల్ సంఘం జిల్లా కార్యదర్శి షణ్ముఖం, ఆర్చరీ సంఘం తరఫున ధనంజయ, బ్యాడ్మింటన్ తరఫున రామకృష్ణ, శివయ్య, శాప్ కోచ్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం




సత్యవేడు, మార్చి 23 ప్రభాతవార్త:

సామాజిక న్యాయం కోసం శెట్టిబలిజ జాతీయ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ మాట్లాడుతూ సమానత్వం, స్వాభిమానం కోసం పోరాడిన మహనీయుడని ఆయన కొని యాడారు. ప్రస్తుత తరాలు ఆయన ఆదర్శాలను అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. శెట్టి బలిజ సమాజ అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు అపారం అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యా సామాజిక చైతన్యం కల్పించడంలో ఆయన చూపిన దార్శనికత ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి అధ్యాపకులతో కలసి ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ మ్యూల్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు హన్న, ఎస్.హరిప్రసాద్, మురళీమోహన్, వెంకటేశులు, ఎం.హరిప్రసాద్, రవిశంకర్, ఈశ్వరయ్య, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



సత్యవేడు, మార్చి 23 ప్రభాతవార్త:

సత్యవేడులో పది పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతోంది. మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతోంది. పట్టణంలోని బాలుర గురుకులం, బాలికల గురుకులం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలోని మూడు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులు గణిత పరీక్షలను రాశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు గాను 199 మంది హాజరు కాగా, బాలికల గురుకులంలో 200 మందికి 200 మంది హాజరైనట్టు స్థానిక ఎంఈవో రవి పేర్కొన్నారు. అలాగే జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 198 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరయ్యారు.పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీటి వసతి, మెడికల్ వంటి అత్యవసర సేవలను అందుబాటులో ఉంచారు. కాగా పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు సజావుగా కొనసాగడానికి స్థానిక ఎస్ఐలు సాయినాథ్‌చౌదరి, లావణ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బందికి తగిన సూచనలు ఇస్తున్నారు.

# పన్నెం బాలసుందరంను పరామర్శించిన ఎమ్మెల్యే

వరదయ్యపాలెం, మార్చి 23, ప్రభాతవార్త



సీనియర్ టీడీపీ నాయకుడు, వరదయ్యపాలెం మాజీ సర్పంచ్ పన్నెం బాలసుందరంని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు కొంతసేపు మాటామంతి కలిపి, పాత జ్ఞాపకాలను ముచ్చటించుకున్నారు. గత రాజకీయ అనుభవాలు, గ్రామ అభివృద్ధికి చేసిన కృషి గురించి స్మరించుకుంటూ స్నేహపూర్వక వాతావరణంలో సంభాషణ సాగింది. ఈ పరామర్శ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ ఆణిముత్యం, నందకిషోర్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## భారత ముద్దుబిడ్డలకు నివాళి



తిరుపతి,మార్చి 23 ప్రభాత వార్త:

భారత ముద్దుబిడ్డలు భగత్ సింగ్, రాజ్ గురు,సుఖదేవుల త్యాగాలను స్మరించుకుంటూ వారి విగ్రహాలకు భారతీయ జనతా పార్టీ నాయకులు నివాళి అర్పించారు. వీర కిశోరాల వర్ధంతిని తిరుపతిలో బిజెపి నాయకులు సోమవారం నిర్వహించారు .స్థానిక కులశేఖర్ మార్గంలోని వారి విగ్రహాలకు పుష్పాంజలు ఘటించి నివాళి అర్పించారు. వారి ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ వారికి నివాళి అర్పించడం ప్రతి భారతీయుడు కర్తవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏ వన్ మస్తాన్, అంకాల పరమేశ్వరి దేవాలయ పాలకమండలి సభ్యులు దస్తగిరి రెడ్డి, రామ్ కుమార్, జనార్దన్ రెడ్డి మణికంఠ వాసు పొన్నాల జేజిరెడ్డి మిట్టపల్లి బ్రహ్మానందం , విజయ్ భాస్కర్ రెడ్డి, జయంత్ కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.

# 'మీకోసం' - ప్రజా సమస్యల పరిష్కార వేదిక



తిరుపతి,మార్చి 23ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే "మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బాధితుల నుండి వినతి పత్రాలను స్వీకరించి, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తూ తక్షణ విచారణ చేపట్టి పరిష్కారం చేయాలనీ ఆదేశించారు. ప్రజలకు త్వరతిగతిన న్యాయం అందించాలనే లక్ష ్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల వివిధ రకాల ఫిర్యాదులను స్వీకరించి, బాధితుల సమస్యలను ఓపికగా విని, పరిష్కార దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేస్తూ, దివ్యాంగులు, వృద్ధులు మరియు మహిళలకు సంబంధించిన సమస్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 57 ఫిర్యాదులు స్వీకరించడం జరిగింది, ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, పరిష్కారం నిమిత్తం సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరచారి ,శ్రీనివాసులు, సంబంధిత సీఐలు,ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### వికేఆర్‌వై కాలనీ గిరిజనులను

# భూమి సాగుకు అనుమతించాలి

## - సిపిఐ చిన్ని రాజ్ డిమాండ్




వరదయ్యపాలెం, మార్చి 23, ప్రభాతవార్త

వరదయ్యపాలెం మండలం పాదిరి కుప్పం రెవెన్యూ గ్రామంలో సోత్రియం భూములుగా 1165 ఎకరాలు భూములు ఎస్టేట్ అబాలషన్ యాక్ట్ కిందికి వస్తుందా రాదా అని వివాదంలో కింది శక్తి సెటిల్మెంట్ కోర్టు నుంచి ఢిల్లీ సుప్రీంకోర్టు వరకు జరుగుతూ ఉందని అందులో కొంత భూమిని చిత్తూరు జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన ప్రేమచంద్రారెడ్డి, నాగార్జున కలెక్టర్లు గిరిజనుల కోసం పోరాడిన వెన్నెల గడ్డి రాఘవయ్య స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతితో కలెక్టర్లుగా వారికున్న అధికార రీత్యా సర్వే నెంబరు 84. 75ల లో సుమారు 300 ఎకరాలపైగా భూములలో ఇళ్ల పట్టాలు గిరిజనులు సాగు చేసుకోవడానికి భూములు ఇచ్చే వెన్నెల కంటే రాఘవయ్య గిరిజన కాలనీ పేరుతో 300 మంది గిరిజనులను సమీకరించి అక్కడ ఏర్పాటు చేయడం జరిగింది 40 సంవత్సరాల నుండి గిరిజనులు సాగు చేసుకుంటున్నారని అందులో 15 ఎకరాలకు కలెక్టర్ ఇళ్ల పట్టాలు కూడా మంజూరు చేయడం జరిగిందని ఇటీవల కాలంలో శ్రీ సిటీ, హీరో, అపోలో టైర్స్ లాంటి పరిశ్రమలు పక్కనే ఉంది ఉన్నందువలన ఈ భూములను గిరిజనులు సాగు చేసుకోకూడదని పంటలు పెట్టకూడదని రెవెన్యూ అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు వ్యవసాయం చేయకుండా ఖాళీగా ఉన్న భూములలో డబ్బులు ఉన్న ధనవంతులు రాజకీయ పలుకుబడి కలిగిన పెద్దందారులు కొంతమంది ఆ భూములు నాక్రమించుకొని పెద్దపెద్ద భవనాలు నిర్మించి పక్కనే ఉన్న కార్మికులకు ఉద్యోగులకు వాడుకులకు ఇస్తున్నారని ఎందుకు గతంలో ఉన్న రెవెన్యూ అధికారులు అవినీతికి లోబడి వారికి అవకాశం కల్పించాలని చిన్ని రాజు ఆరోపించారు. అది సాకుగా చూపెడుతూ గిరిజనులు ఎంతో శ్రమకోర్చి చెట్టు పుట్ట కొట్టి సాగులోకి తెచ్చిన భూములను ఇప్పుడు రెవెన్యూ అధికారులు మీరు సాగు చేయకూడదని ఆంక్షలు విధించడం చాలా దుర్మార్గమని అన్యాయమని గిరిజనుల ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములు తనకే ఇవ్వాలని ఒకవైపున భారత్ కమ్యూనిస్టు పార్టీ అండతో ఆందోళన పోరాట కార్యక్రమాలు చేస్తుంటే ఇంకొక వైపున సోత్రియం భూముల ఆక్రమించుకుని అక్రమంగా అనుభవిస్తున్న వారు కొంతమంది రాత్రి వేళలో గిరిజన కాలనీలో వీరంగం సృష్టించడం గిరిజనులను భయభ్రాంతులకు గురి చేయడం జరుగుతుందని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని గిరిజనులు రక్షణ కల్పించాలని చిన్ని రాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్ సిపిఐ నాయకులు బాల గురునాథం, కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు ధనుంజయలు శెట్టి, ధనుంజయ నాయుడు, గిరిజన సంఘం నాయకులు చెల్లమ్మ, రామకృష్ణయ్య, కళ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరులో భగత్‌సింగ్ వర్ధంతి

పుత్తూరు రూరల్, మార్చి 23 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో ఆటో స్టాండ్ వద్ద భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో రాష్ట్రంలో డ్రగ్స్ మత్తు పదార్థాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ డ్రగ్స్ వల్ల విద్యార్థుల భవిష్యత్ నాశనం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు భగత్‌సింగ్ స్ఫూర్తి ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్, నందయ్య, విజయ్, హరిచంద్ర, యాసిన్ బాషా, రవి, శుభ తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## రెండోసారి ఆగిన పోలేరమ్మ హుండి లెక్కింపు!



నాయుడుపేట, మార్చి 23 ప్రభాతవార్త: శ్రీ శ్రీ గ్రామ దేవత నాయుడుపేట నడిబొడ్డున వెలసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ హుండీ లెక్కింపు రెండో సారి ఆగింది. ఈ మేరకు ఎండోమెంట్ అధికారులు తొలిసారి వాయిదా వెయ్యగా రెండో సారి కూడా అదే విధంగా వాయిదా వేశారని నాయుడుపేట శ్రీశ్రీ పోలేరమ్మ భక్తులు ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవత శ్రీ శ్రీ పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు విషయంలో జాప్యం జరుగుతుందని పలువురు అమ్మవారి వారి భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. రానున్న మే నెలలో శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవం సందర్భంగా లెక్కించవలసిన హుండీ లెక్కింపు సకాలంలో నిర్వహించని ఎండోమెంట్ అధికారుల తీరును ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎందుకిలా రెండుసార్లు వాయిదా వేశారని ప్రజలు ఆగ్రహంతో పూణకం పూనిన వారిలాగా ఊగిపోతున్నారు. నాయుడుపేట చుట్టు పక్క గ్రామ పెద్దలు ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నలపై ప్రశ్న వేయడంతో ఆమె భక్తులు, గ్రామస్తులు అగ్ని జ్వాలలా రగిలిపోతున్నారు. ఇలా ఎన్నడు లేని విధంగా శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఇలా జరగలేదని వాళ్లు విమర్శించారు. ప్రస్తుత నాయుడుపేట ఎండోమెంట్ అధికారులుగా వ్యవహరిస్తున్న వీరు వారు రాలేదని వీరు రాలేదని హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని వాయిదా వేయడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు.

## 11 రోజుల తర్వాత పోరాట ఫలితం



నాయుడుపేట, మార్చి 23 ప్రభాతవార్త: మున్సిపాలిటీలో నాన్ -ఏపిసిఓఎస్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 11వ రోజుకు చేరాయి. కార్మికుల దీర్ఘకాల పోరాటం నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య, స్థానిక నాయకులు శివకవి ముకుంద తదితరులతో చర్చలు జరిగాయి. అనంతరం కార్మికుల పోరాటానికి ఫలితంగా కమిషనర్ ప్రజరుల్లా కీలక హామీలు ఇచ్చారు. నాన్ -ఏపిసిఓఎస్ కార్మికులకు ఏడు నెలల జీతాలు బకాయి ఉండగా ఇప్పటికే నాలుగు నెలల జీతాలు చెల్లించామని, జిల్లా ఆడిట్ ఆఫీసర్ నుండి అనుమతి వచ్చిన వెంటనే మిగిలిన మూడు నెలలు జీతాలు కూడా చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు. జీతాలు అడిగినందుకు కార్మికులను తొలగిస్తారని కొంత మంది మేస్త్రీలు బెదిరిస్తున్నారని యూనియన్ నాయకులు తెలియజేయగా, ఎవరూ తొలగించబడరు, మేస్త్రీలకు కార్మికులను బెదిరించే అధికారం లేదు. అలాంటి చర్యలు ఉంటే వెంటనే తెలియజేయండి వెంటనే కఠిన చర్యలు తీసుకుంటాను అని కమిషనర్ హామీ ఇచ్చారు. హామీలు అమలు కాకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, అనిల్, రమణయ్య, సురేష్, అజయ్, వరమ్మ, సుబ్బయ్య, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమం



పెళ్లకూరు, మార్చి 23 ప్రభాతవార్త: వేసవిలో వరి వేయడానికి రైతులు సిద్ధపడుతున్నారని సరైన విత్తన రకాలను ఎంచుకుంటే వరిలో అధిక దిగుబడులు సాధించి అధిక రాబడును పొందవచ్చు అని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగార్జున సాగర్ అన్నారు. సోమవారం నాడు మండలంలోని భీమవరం పంచాయతీలో నిర్వహించిన రైతు శిక్షణ ఆత్మ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరులశాఖ కేంద్రం నుండి వచ్చిన సహా వ్యవసాయ సంచాలకులు ఈ. రంగరాజన్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులపై పూర్తిగా ఆధారపడకుండా సేంద్రీయ ఎరువులు పచ్చిరొట్ట ఎరువులు జీవ రసాయన ఎరువులను విరివిగా వాడాలని అదేవిధంగా నానో యూరియా, నానో డీఏపీలను కూడా ఎక్కువగా వాడి ఆరోగ్యకరమైన పంటలను పండించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రైతులకు పిలుపునిచ్చారు. కెవికె పెరియవరం శాస్త్రవేత్త డాక్టర్ రాజీవన మాట్లాడుతూ రైతులు కనీసం 3 సంవత్సరాలకు ఒక్కసారైనా మట్టి పరీక్షలు చేయించి భూసార పరీక్ష పత్రము ఆధారంగా ఎరువులు వాడి మేలైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితేఅధిక దిగుబడులను పొందవచ్చు అన్నారు. మండల వ్యవసాయ అధికారిని విజయభారతి రైతులకు రైతన్నా మీకోసం, ఫార్మర్ యాప్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి, మొదలైన వాటి గురించి వివరించారు. చివరగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ జై తుంబి మాట్లాడుతూ వరిలో ఉపయోగించే వివిధ రకాల కషాయాలు, బీజామృతం, జీవామృతం, పిఎండిఓ కిట్లు గురించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు.

## ఆర్టీసీ బస్సులుకై అగుచాట్లు

పెళ్లకూరు, మార్చి 23 ప్రభాతవార్త: నాయుడుపేట, శ్రీకాళహస్తి రహదారి మార్గంలో శ్రీకాళహస్తి సూళ్లూరుపేట గూడూరు డిపోలుకు చెందిన ఆర్టీసీ బస్సులు మండల కేంద్రమైన పెళ్లకూరులో ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాళహస్తి నాయుడుపేట మార్గంలో సింగమాల, నెలబల్లి, టెంకాయ తోపు, పెళ్లకూరు, చిల్లకూరు, చావాలి ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లపై వెళ్లకుండా నేరుగా జాతీయ రహదారి మార్గంలో ఫ్లై ఓవర్ మీదుగా వెళుతుండడం వల్ల ఆ ప్రాంత పల్లె వాసులకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. గతంలో శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ సర్వీసులు నడుస్తుండేవి అయితే ప్రస్తుతం సూళ్లూరుపేట డిపో కు చెందిన పల్లె వెలుగు బస్సులు ఎక్కువగా నడుస్తుండడంతో వారు సర్వీసు రోడ్డు మార్గం గుండా కాకుండా జాతీయ రహదారి ఫ్లైఓవర్ పై నేరుగా వెళుతుండడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. పెళ్లకూరు మండల కేంద్రం కావడంతో పలు ప్రాంతాల నుండి నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో గూడూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా మండల కేంద్రమైన పెళ్లకూరులో ఆపుతుండడంతో దూర ప్రాంతాల నుండి వచ్చే ఉద్యోగస్తులకు ప్రజలకు అణువుగా ఉండేది. ఇప్పుడు నేరుగా ఫ్లైఓవర్ పై వెళుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రయాణికుల ఆగుచాట్లకు అడ్డుకట్ట వేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## యువతకు పరిశ్రమల భాగస్వామ్యం పెంచాలి : ఎంపీ

వెంకటగిరి, మార్చి 23 ప్రభాతవార్త: జిల్లాలో పరిశ్రమల భాగస్వామ్యం తక్కువగా ఉండటం వల్ల యువతకు అందుతున్న శిక్షణ అవకాశాలు తగ్గుతున్నాయనే ఉన్నాయని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఈ అంశాన్ని తిరుపతి ఎంపీ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. నేషనల్ అప్రెంటిస్ ట్రెనింగ్, ప్రమోషన్ స్కీమ్ కింద తిరుపతి జిల్లాలో పరిశ్రమలు ఆశించిన స్థాయిలో ముందుకు రావడం లేదని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ పథకాల ద్వారా విద్యార్థులు చదువు పూర్తయ్యాక పరిశ్రమల్లో ప్రత్యక్ష అనుభవం పొందే అవకాశాలు కల్పించాల్సి ఉండగా, స్థానికంగా పరిశ్రమల పాల్గొనడం పరిమితంగా ఉండటం వల్ల యువతకు నష్టం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ మాట్లాడుతూ ప్రస్తుతం తిరుపతి జిల్లాలో కేవలం 28 కంపెనీలు మాత్రమే నేషనల్ అప్రెంటిస్ ట్రెనింగ్, ప్రమోషన్ స్కీమ్ కింద నమోదు అయి ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని, ముఖ్యంగా నమోదు ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా సులభతరం చేయడం, సెంట్రలైజ్డ్ రిజిస్ట్రేషన్ విధానం అమలు చేయడం, అప్రెంటిస్ కాంట్రాక్టులు, స్టైపెండ్ చెల్లింపులు, మానిటరింగ్ వంటి ప్రక్రియలను డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రత్యేకంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఈ పథకాలలో సులభంగా భాగస్వామ్యం కావడానికి థర్డ్ పార్టీ అగ్రిగేటర్లను నియమించి, రిజిస్ట్రేషన్, కంప్లయన్స్, నిర్వహణ వంటి అంశాల్లో సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు.ఈ పథకాల ద్వారా జిల్లాలోని యువతకు మెరుగైన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## యువత భగత్ సింగ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి



వెంకటగిరి, మార్చి 23 ప్రభాతవార్త: భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాణి పేట నుండి భ్రమరాంబ హాల్ వద్ద వరకు పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌ఓ ఏరియా కన్వీనర్ సిహెచ్ పవన్ మాట్లాడుతూ భగత్ సింగ్ అమరులయి 95 సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికీ సామ్రాజ్యవాదుల దోపిడి కొనసాగుతూనే ఉందని మాట్లాడారు. ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజవాదులు ఎలా అయితే భారత ప్రజలను పట్టి పీడించారో అదేవిధంగా ఇప్పుడు అమెరికన్ సామ్రాజవాదులు ఇజ్రాయిల్ తో కలిసి ఇరాన్‌పై అమానుష్యంగా యుద్ధోన్మాద దాడులు చేయడనీ అందరూ ఖండించాలన్నారు, ఇటీవల వెనిజులా దేశ అధ్యక్షుడునీ ఆయన భార్యను అపహరించడం, మూడేళ్ల పాటు పాలసీనపై దాడి చేసి లక్షలాది మందిని పొట్టన పెట్టుకోవడం చూస్తే ఆధిపత్యం కోసం, ఆయిల్ దోపిడీ కోసం సాగించిన దారుణాలే అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల, సుబ్బు, తేజు, సురేంద్ర, 200 పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## శివలింగాపురం గ్రామంలో యాచేంద్ర ఆలయం



వెంకటగిరి, మార్చి 23 ప్రభాతవార్త: మండలం పారవోలు గ్రామపంచాయతీ పరిధిలోని శివలింగాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ శివలింగేశ్వర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా జరిగింది. వెంకటగిరి సంస్థానా దీశులు, మాజీ ఎమ్మెల్యే దివంగత రాజా వి.వి.వి.ఆర్.కె. యాచేంద్ర జ్ఞాపకార్ధంగా ఆయన మనుమడు వెంకటగిరి సంస్థానం యువరాజు 33వ తరం రాజావివి సర్వజ్ఞ కుమార కృష్ణ యాచేంద్ర నిర్మించిన ఈ నూతన ఆలయంలో ఆయన చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యువరాజాకి స్థానిక ప్రజలు, నాయకులు శాలువాలతో సత్కరిస్తూ బ్రాహ్మణోత్తములచే పూర్ణకుంభంతో వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అడుగడుగునా బాణా సంచా పేలుస్తూ డప్పులు వాయిస్తూ పూలతో కర్పూర హారతులతో ఘన స్వాగతం పలికారు.

## పాండురంగ దేవస్థాన పుష్కర కుంభాభిషేకం



సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ పాండురంగస్వామి దేవస్థానంలో పుష్కర కుంభాభిషేక వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఈ ఉత్సవాల్లో భాగంగా వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన పాల్గొన్నారు. స్వామివారికి పండితుల మంత్రోచ్చరణతో శుద్ధి చేసిన కలశ జలాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డులో ఉన్న దేవాలయాల్లో ఆధ్యాతిక పరంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పండరి భజనలు, భక్తిగీతాలు, వెంకటేశ్వర నామ స్మరణలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. పాండురంగ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## గురుకుల పాఠశాల విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

**- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**



సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త: గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమాన్ని ధ్యేయంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం ఆమె పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో వస్తున్న ఆరోపణలపై ఆమె స్పందించి స్వయంగా గురుకుల పాఠశాలకు వెళ్లి విద్యార్థులను అడిగి భోజనం నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గురుకుల పాఠశాల సిబ్బందితో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు తన దృష్టికి వచ్చాయని, ఇదే విధంగా కొనసాగితే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థుల భద్రతపై కూడా సిబ్బంది ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. అనంతరం హాస్టల్ గదులు, స్టోర్ రూమ్, మంచినీటి వసతులు, మరుగుదొడ్డి సౌకర్యం, విద్యుత్ సరఫరా వంటి విషయాలపై స్వయంగా పరిశీలించడంతో పాటు విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెసుకున్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యా ప్రమాణాలను పెంచి కార్పొరేట్ స్థాయిలోకి సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను తీసుకురావాలని ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని సంక్షేమ గృహాల విషయంలో ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, కొమరంజేరి శ్రీధర్, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగులో రైతులు మెలుకవులు పాటించాలి



తడ,మార్చి 23 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్లో పంట సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని ఎండ తీవ్రతను బట్టి రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని నెల్లూరు ఆత్మ డిఆర్సి ఏడిఏ రాజ్ కుమార్ రైతులకు తెలియజేశారు సోమవారం కాదలూరు రైతు సేవా కేంద్రం నందు రైతులకు సాగు మెలుకువలు ఎడిఏ రాజకుమార్ తెలియజేశారు. వారు మాట్లాడుతూ విత్తనం ఎంపిక నుండి పంట చేతికి వచ్చేవరకు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని పంట దశను బట్టి చీడపీడలను గుర్తించి మొదటి దశలోనే నివారించాలని రైతులకు తెలియజేశారు వెంకటగిరి కెవికె రాజీవన్ మాట్లాడుతూ ప్రతి రైతు మట్టి నమూనా పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి ఎరువులు ఉపయోగించాలని యూరియా వాడకాన్ని తగ్గించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఏ డి ఏ కాంచన తడ ఏఓ కిరణ్ కుమార్ దొరవారిసత్రం ఏవో జ్యోతిర్మయి రైతులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై ఇద్దరు యువకుల్లు ఆత్మహత్య!

తడ,మార్చి 23 ప్రభాతవార్త: ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి అక్కంపేట రైల్వే స్టేషన్ సమీపంలో కొండూరు గ్రామ సమీపంలో రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డారు సూళ్లూరుపేట మండలం పేర్నాడు గ్రామానికి చెందిన జడ సునీల్ (25) సూళ్లూరుపేట మండలం పిండి పాలెం గ్రామానికి చెందిన కళ్యాణ్ (24) ఇద్దరు యువకులు రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డారు అదే సమయానికి దూసుకు వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు కళ్యాణ్ అనే యువకునికి వివాహమై సుమారు రెండు నెలలు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి రెండు కుటుంబాలు శోకసంద్రంలో పోయాయి ఆదివారం రాత్రి ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు మృతి దేహాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: గంజి మాధవయ్య



పుత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త : రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం రైతుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. రూరల్ మండపం పరిధిలోని గోపాలకృష్ణాపురం గ్రామంలో అన్నదాత సుఖీభవ మూడో విడత ఇంటింటి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా రైతుల బ్యాంక్ ఖాతాల్లో కూటమి ప్రభుత్వం రూ. 20,000 జమ చేస్తోందని తెలిపారు. ఇప్పటికే ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అనంతరం మీ కోసం కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్‌కుమార్, తడుకు సింగిల్ విండో ఛైర్మన్ కరుణ యాదవ్ బూత్ ఇన్‌ఛార్జ్ హరగోపాల్ పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా తిరుపతి పార్లమెంట్ ... కార్యాలయ నూతన ప్రారంభోత్సవం



తిరుపతి, మార్చి 23 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్లమెంట్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్‌లు, రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, అతిథిలో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి,పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావుకి నివాళులు అర్పించారు.

**మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా...**

## కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాలకు పదవికాలం ముగియడంతో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక అధికారిగా నియమితులైన కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## కాణిపాకం ఆలయానికి 1.28 కోట్లు ఆదాయం



కాణిపాకం,మార్చి 23 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి దేవస్థానంలో వివిధ లీజు హక్కుల కోసం సోమవారం నిర్వహించిన టెండర్లు ద్వారా రికార్డు స్థాయిలో 1.28 కోట్లు రూపాయలు ఆదాయంగా లభించింది. దేవస్థానం వద్ద సెల్ ఫోన్‌లు భద్రపరచుకునే హకు లీజు కోసం ఏడాది కాలానికి ఆన్‌లైన్ టెండర్లు, బహిరంగ వేలము, సీల్డ్ టెండర్లు నిర్వహించగా రికార్డు స్థాయిలో 1,27,16,369 రూపాయలు ఆదాయంగా లభించింది. ఈవేలం పాటల్లో ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరెండెంట్ బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

**పార్కింగ్ రుసుము లీజు ద్వారా 3.20 కోట్లు ఆదాయం :**

కాణిపాకం గ్రామపంచాయతీలో వాహన పార్కింగ్ రుసుము వసూలు కోసం సోమవారం నిర్వహించిన లీజు వేలం పాటల ద్వారా రికార్డు స్థాయిలో 3.20 కోట్లు రూపాయలు ఆదాయంగా లభించింది. 60:40 నిష్పత్తిలో గ్రామ పంచాయతీ, దేవస్థానంలు సంయుక్తంగా టెండరు నిర్వహించారు. చిత్తూరు డీఎల్‌పిఓ జి.రవికుమార్, సర్పంచ్ కెఎస్,.శాంతిసాగర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏడాది కాలానికి ఆన్‌లైన్ టెండర్లు, బహిరంగ వేలము, సీల్డ్ టెండర్లు నిర్వహించారు. ఈ వేలంపాటల ద్వారా 3.20 కోట్లు రూపాయలతో అత్యధిక బిడ్డర్‌గా సెల్వం పాటను దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రమీల, వ్యాపారస్థులు పాల్గొన్నారు.

## మానవత్వ విలువలు పెంపొందించడానికి దొమ్మేటి వెంకటరెడ్డి కృషి : ఎస్పీ తుషార్ డూడి



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త: సమాజంలో సమానత్వం, విద్యాభివృద్ధి, మానవత్వ విలువలు పెంపొందించడానికి తన జీవితంను దొమ్మేటి వెంకటరెడ్డి అంకితం చేశారని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. జిల్లా పోలీసు సాయుధదళ కార్యాలయంలో సోమవారం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడి దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి వ్యాపారవేత్తగా విదేశాల్లో వున్నప్పటికీ స్వదేశీఅభిమానంతో విద్యారంగానికి ఆస్తులు దానం చేయడం ఆయన గొప్పతనంకు నిదర్శనమన్నారు. సామాజిక సమానత్వం, కులవివక్ష నిర్మూలన, వయోజన విద్య అంశాలపై దొమ్మేటి వెంకటరెడ్డి చూపిన ధృడ సంకల్పం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఎఎస్పీ దేవదాస్, డిటిసి డిఎస్పీ రాంబాబు, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ భాషలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

**ఎస్పీ కార్యాలయంలో...**

## సామాజిక సేవకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి



తిరుపతి,మార్చి 23ప్రభాతవార్త: శెట్టిబలిజ జాతి పితామహుడు, సామాజిక సేవకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి సమాజంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన సేవలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. విద్య, సామాజిక చైతన్యం, సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా గుర్తింపు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరచారి ,శ్రీనివాసులు, ఎస్‌బీ డీఎస్పీ వెంకటనారాయణ, చంద్రశేఖర్,ఏవో సురేష్ కుమార్,డీపీవో అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయ ప్రతిష్టకు మచ్చ... శ్రీనివాస ఆడిటోరియం నిరక్ష్యానికి బలి



తిరుపతి విద్య, మార్చి 23 ప్రభాతవార్త: ఎస్వీయూలో ఒకప్పుడు గర్వకారణంగా నిలిచిన శ్రీనివాస ఆడిటోరియం నేడు నిరక్ష్యానికి బలైపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 1970లో ఎలాంటి పిల్లర్లు లేకుండా నిర్మించిన ఈ అద్భుత కట్టడం ఇప్పుడు ప్రమాదకర స్థితికి చేరింది. గిరిజన నవసమాజ్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్ ఈ దుస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వీసీ టాటా నర్సింగరావును కలిసి వినతిపత్రం సమర్పిస్తూ సమస్యను వివరించారు.ఒకప్పుడు వైభవంగా నిలిచిన ఆడిటోరియం ఇప్పుడు పాడుబడ్డ భవనంలా మారడం బాధాకరం. పైకప్పు ఇనుప పెచ్చులు ఊడిపడి వేలాడుతూ ఉండడం ప్రమాదాన్ని సూచిస్తోంది. వర్షం పడితే లోపలికి నీరు కారడం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పకనే చెబుతోంది. ఎప్పుడైనా ఇనుప కడ్డీలు విరిగి పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.ఇంత విలువైన కట్టడాన్ని సరైన సంరక్షణ లేకుండా వదిలేయడం అధికారుల నిరక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉపయోగించే స్థలంలో ఇలాంటి పరిస్థితులు ఉండటం అసహ్యకరమన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి ఈ చారిత్రక నిర్మాణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ప్రశాంత్, బాలు నాయక్ పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా లేదా అన్నది ప్రశ్నగా మారింది.

## అష్టలక్ష్మి, శ్రీచక్ర పునఃప్రతిష్టకు అంకురార్పణ



చంద్రగిరి, మార్చి 23 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో అష్టలక్ష్మి (8 లక్ష్మీదేవి విగ్రహాలు) విగ్రహ ప్రతిష్టకు సోమవారం ఆలయ అర్చకులు సూరి స్వామి శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. ఇందులో భాగంగా సాయంత్ర 5 గంటలకు గణపతి పూజ, పుణ్యా హవాచనము, రక్ష బంధనము, ఆచార్య వరణము, తీర్థపరిగ్రహణము, మృత్సంగ్రహణము, అంకురార్పణ గావించారు. తదుపరి కలశ స్థాపన, కలశారాధన, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం, పూర్ణాహుతి, మంత్ర పుష్పము, హారతి, తీర్థప్రసాద వినియోగము గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ కె.మమత, పూజారులు పద్మావతి, అరుణకుమారి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## డ్రగ్స్‌పై యుద్ధానికి యువత సిద్ధం..
### భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రతిజ్ఞ

తిరుపతి విద్య, మార్చి 23 ప్రభాతవార్త



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 95వ వర్ధంతి సందర్భంగా తిరుపతిలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో యువతలో కొత్త చైతన్యం రేకెత్తించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. సాయి లక్ష్మి పాల్గొని యువతకు దిశానిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడని గుర్తుచేశారు. ఆయన ఆశయాలు కేవలం చరిత్రలోనే కాకుండా నేటి సమాజంలో కూడా మార్గదర్శకంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుతం యువత మత్తు పదార్థాల బారిన పడుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో పాలకులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. అనాడు స్వాతంత్ర్య సమరంలో భగత్‌సింగ్ వంటి అమరవీరులు చూపిన ధైర్యం, త్యాగం నేటి యువతకు ఆదర్శంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థి నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. చివరగా అమరవీరుల స్ఫూర్తితో మాదకద్రవ్యాలపై పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## విజేతలు పనులను భిన్నంగా చేస్తారు: ఐఎఫ్‌ఎస్ అధికారి సెల్వం
### మహతిలో లిటిల్ ఏంజిల్స్ వార్షికోత్సవ సందడి

తిరుపతి విద్య మార్చి 23 ప్రభాతవార్త



స్థానిక లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ 45వ వార్షికోత్సవ వేడుకలు మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా అటవీ సంరక్షణ అధికారి సి. సెల్వం (ఐఎఫ్‌ఎస్), ఐటిసిఎల్ ప్రతినిధులు జయంత్ కుమార్, ఉమాకాంత్, ఎస్వీ జూలాజికల్ పార్క్ సహాయక క్యూరేటర్ ఎం.జగదీష్ చంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ కె.ఆర్. సుస్మితా రెడ్డి స్వాగతోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సి. సెల్వం మాట్లాడుతూ, విజేతలు సాధారణ పనులనే భిన్నంగా చేసి విజయం సాధిస్తారని అన్నారు. విద్యార్థులందరికీ సమాన అవకాశాలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకునే వారు మాత్రమే ముందుకు వస్తారని తెలిపారు. తరగతి గదిలో క్రమశిక్షణతో చదివే విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని సూచించారు. జయంత్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల అభిరుచులను గౌరవించి, వారు ఎంచుకున్న రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. ఈ పాఠశాల మాజీ విద్యార్థి జగదీష్ చంద్రప్రసాద్ తన విజయానికి పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణే కారణమని పేర్కొన్నారు. డాక్టర్ కె.ఆర్. శ్వేతా రెడ్డి సీతాకోకచిలుక జీవిత చక్రాన్ని ఉదాహరణగా తీసుకుని విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అధినేత కె. రాజగోపాల్ రెడ్డి కృషి ద్వారానే విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అరవింద్ రెడ్డి, అధినేత్రి కె. రమాదేవి, ప్రిన్సిపాల్ వై. పద్మశ్రీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా.. సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



తిరుపతి విద్య, మార్చి 23 ప్రభాతవార్త

తిరుపతి నియోజకవర్గంలో పేదలకు ఆర్థిక సహాయం అందించే దిశగా సిఎంఆర్ఎఫ్ నిధులు కీలకంగా మారుతున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో 18 మంది లబ్ధిదారులకు రూ.13,97,386 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులకు అవసరానికి అనుగుణంగా ఈ సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో సిఎంఆర్ఎఫ్ పేదలకు ఆర్థిక అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అవసరమైన ప్రతి అర్హుడికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జీవకోన, తాతానగర్, మధురానగర్, బైరాగిపట్టెడ, న్యూ మారుతీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు ఈ సహాయం అందుకున్నారు. కొంతమంది లబ్ధిదారులకు లక్షకు పైగా సాయం అందించడం గమనార్హం. ఈ ఆర్థిక సహాయం తమకు ఎంతో ఉపశమనంగా ఉందని లబ్ధిదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం ప్రజలకు మరింత చేరేలా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ విజయ్, రాజా రెడ్డి, బాబ్జీ, ఆర్కాట్ క్రిష్ణ ప్రసాద్, కొండా రాజమోహన్, వినోద్ రాయల్, ఆముదాల వెంకటేష్, చింతంశెట్టి మధు, శ్రావణ్, మణి, సాయిదేవ్ యాదవ్, రాజేష్ ఆచ్చారి తదితరులు పాల్గొన్నారు.

## బంగారు నగల అంగళ్లపై విజిలెన్స్ మెరుపు దాడులు..

రైల్వేకోడూరు రూరల్, మార్చి 23 ప్రభాతవార్త



రైల్వే కోడూరు పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉన్న బంగారు అంగళ్లపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా నుండి విజిలెన్స్ అధికారులు రైల్వేకోడూరు పట్టణంలో అంగళ్లపై దాడులు జరుగుతాయనే సమాచారం తెలుసుకున్న నగలు దుకాణ యజమానులు ఒక్కసారిగా అందరూ షాపులను మూసివేసి పరారయ్యారని అయితే రెండు షాపులు యధావిధిగా తెరిచి ఉంచి వ్యాపారాలను నిర్వహించారు. బంగారంపై హాల్ మార్క్, తూకాల సామాగ్రి, జీఎస్టీ రిటర్న్స్ అనే అంశాలపై సంబంధిత విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేశారని వినియోగదారులకు ఎవరైనా బంగారు దుకాణ యజమానులు మోసం చేసినట్లు తెలిస్తే షాపు యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఇప్పటికీ విజిలెన్స్ దాడులు ఈ మధ్యకాలంలోనే మూడుసార్లు రైల్వే కోడూరు ప్రాంతంలో సంచరించినట్లు తెలియ వచ్చింది.

## ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



చంద్రగిరి, మార్చి 23 ప్రభాతవార్త:

విద్య, క్రమశిక్షణ, నాణ్యతాప్రమాణాలతో కూడిన ఆహారం అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. పనపాకం జడ్పీహై స్కూల్లో సోమవారం ఎంఎల్ఏ డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులు, వంట గదిని పరిశీలించారు. ఉపాధ్యాయుల విద్యాబోధనలపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 340 పాఠశాలలో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులతో కలసి సహ పంక్తి భోజనం చేసిన ఆయన తన భోజనం ప్లేటును స్వయంగా శుభ్రపరిచారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పనపాకం క్లస్టర్ ఇన్‌చార్జ్ మేడసాని కుమార్, టిడిపి ఆయకట్టు చైర్మన్ నగరం రమేష్, హెచ్‌ఎం ఎస్.సురేష్, నాయకులు గురవయ్య, నరేంద్ర, మాజీ ఎంపిటిసి చెంగల్రాయులు, జనార్ధన్, గంగాధరం, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వైస్ ఎంపిపికి ఎంఎల్ఏ పరామర్శ

రామచంద్రాపురం, మార్చి 23 ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ వైస్ ఎంపిపి మధుసూదన్ రెడ్డిని, టిడిపి సీనియర్ కార్యకర్త మనోజ్ రాయల్‌ను ఎంఎల్ఏ పులివర్తి నాని పరామర్శించారు. సోమవారం నెన్నూరు, సంతబైలు గ్రామాలలోని క్షతగాత్రుల నివాసాల వద్దకు చేరుకుని వారి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలకు అయ్యే వైద్య ఖర్చులను సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, నాయకులు రావిళ్ళ గిరి, జయచంద్ర నాయుడు, జగదీష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీతో ఎంపీపీ స్కూల్ సందడి

వరదయ్యపాలెం, మార్చి 23, ప్రభాతవార్త



సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్థానిక ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, దాని నాణ్యతపై సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి, భోజనం రుచి, విద్యా సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధన విధానం వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సానుకూలంగా స్పందిస్తూ, భోజనం, పాఠశాల వాతావరణంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో పాఠశాల ముఖద్వారాన్ని పూర్తి చేయించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శెట్టి బలిజల దైవం దొమ్మేటి వెంకటరెడ్డి
### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుహెల్త్, మార్చి 23 ప్రభాతవార్త:

శెట్టి బలిజన దైవం దొమ్మేటి వెంకటరెడ్డి అని, శెట్టి బలిజ సంక్షేమ సంఘం ద్వారా ఆయన పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టి బలిజల్లో చైతన్యం తీసుకువచ్చి వారి హక్కుల సాధన కోసం ఉద్యమించారన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి జీవితం అందరికి ఆదర్శమని, బ్రిటీషు పాలనలో శెట్టి బలిజలు బర్మా వలస వెళ్ళారని, వారిలో దొమ్మేటి వెంకటరెడ్డి వున్నారన్నారు. ఆయన ఓడలను అద్దెకు తీసుకుని వ్యాపారం నిర్వహించి ఓడలకు యాజమాని అయ్యారన్నారు. బర్మాకు దొమ్మేటి వెంకటరెడ్డి మేయర్‌గా పని చేసి అక్కడి శెట్టి బలిజల బాధలను ప్రత్యక్షంగా చూశారన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌లు దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ భాషా, జాతీయ బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి శ్రీదేవి, వికలాంగుల శాఖ ఎడి వినోద్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం చేరుకున్న నారా భువనమ్మ

కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడుసతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మంగళవారం రాత్రి శాంతిపురం మండలం శివపురంలోని తమ స్వగృహంకు చేరుకున్నారు. బెంగళూరు నుంచి రోడ్డుమార్గంలో వచ్చారు. నారా భువనమ్మకు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు. కాగా నాలుగు రోజులపాటు నారా భువనమ్మ కుప్పంనియోజకవర్గంలో పర్యటించనున్నారు.

### తిరుపతిరూరల్‌లో
## నీటి ఎద్దడిపై ఎంపిపి సమీక్ష

తిరుపతిరూరల్, మార్చి23 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలంలో తాగునీటి సమస్య లపై మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి అధికారులతో సమీక్షించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు హిమంత్, హేమాద్రిలతో నీటి సమస్యపై సమీక్షించారు. గ్రామాలవారీగా నీటి పరిస్థితులను తెలుసుకుని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. మరమ్మత్తుకు గురైన బోర్లు, మోటార్లను వెంటనే మరమ్మత్తు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్యలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ...అవసరమైన నిధుల ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఓ పి.యన్.మణి పాల్గొన్నారు.

## అశ్వినికి ఘన సన్మానం

తిరుపతి విద్య, మార్చి 23 ప్రభాతవార్త



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ దక్షిణ భారత చీఫ్ కోఆర్డినేటర్‌గా నియమితులైన ఎంఎంబీజీ స్కూల్ డైరెక్టర్ సంగరాజు అశ్వినిని అపుస్మా నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అశ్వినిని దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను చేరేలా మార్గనిర్దేశం చేస్తున్న అశ్విని సేవలు ప్రశంసనీయమన్నారు. బహుభాషా ప్రతిభతో పాటు సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ ఎంతో మంది విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తున్నారని కొనియాడారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో కీలక బాధ్యతలు స్వీకరించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగరాజు భాస్కర్ రాజు, ఎన్. విశ్వనాథ్ రెడ్డి, డి.జి. రఘు నారాయణ రావు, ఓ. వెం కట్ రమణ రెడ్డి, ఆర్.ఎస్. శ్రీధర్, ఎస్.ఎమ్. భాషా, డా. హర్షిణి, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విజయపురం దళితవాడపంచాయతీలో తాగునీటి సమస్య



విజయపురం, మార్చి 23 ప్రభాతవార్త:

మండలంలోని విజయపురం దళితవాడ పంచాయతీలో వారం రోజుల పాటు తాగునీటి సమస్య చోటు చేసుకుంటున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మోటారు మరమ్మతులకు గురి కావడంతో బోరు తీశారు. కానీ ఇంత వరకు మోటారు బోరు బావిలో దించలేదని వాపోతున్నారు. వేసవి ఎద్దడిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తాగునీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళుతున్నామని, ఈ విషయమై విజయపురంలో ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తాగునీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఉపాధి పనులను వేగవంతం చేయండి: ఎంపీడీవో

విజయపురం, మార్చి 23 ప్రభాతవార్త:



మండలంలోని ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులకు సమావేశం నిర్వహించి వేసవిలోఉపాధి పనుల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు పెంచాలని, వేసవిలో జాగ్రత్తలు తీసుకుంటూ పనులు నిర్వహించాలని కోరారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వం అదనంగా కూలీచెల్లిస్తుందని, ప్రతి ఉపాధి కూలీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో కవిత, ఎంటీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా ముస్లింపాలెంలో
## పంచాయతీ భవనానికి భూమిపూజ

వరదయ్యపాలెం, మార్చి 23, ప్రభాతవార్త



వరదయ్యపాలెం మండలం, గ్రామాభివృద్ధికి మరో అడుగు ముందుకు పడింది. ముస్లింపాలెం పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, స్వంత నిధులతో స్థలం సమకూర్చిన సర్పంచ్ అబ్దుల్ మజీద్ మల్లంగ్ (అలీ)ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీతో పాటు అన్ని వర్గాల అభివృద్ధికి తాను కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో స్థానిక నాయకులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ముస్లిం సంప్రదాయ ప్రార్థనల నడుమ పంచాయతీ భవనానికి భూమిపూజ నిర్వహించగా, గ్రామస్తులు ఆనందంతో స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ భవనం నిర్మాణంతో గ్రామంలో పరిపాలనా కార్యకలాపాలు మరింత సులభంగా నిర్వహించబడతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సుధీర్ రెడ్డి, ఎంపీడీవో, డివిఎంసి మెంబర్ గుత్తి త్యాగరాజు, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు దిలీప్ రాయల్, నాయకులు పురుషోత్తం, వీరభద్రం, రసూల్ సాహెబ్‌లు పాల్గొన్నారు.

## మృతుడు కుటుంబానికి ఆర్థిక సాయం

నాగలాపురం, మార్చి 23 ప్రభాతవార్త:



నాగలాపురం పడమర హరిజనవాడకు చెందిన కరాటే మాస్టర్ గోపి సోదరుడు సుధ(43) అనారోగ్య కారణంతో సోమవారం వేకువ జామున చెన్నై ఆస్పత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాగలాపురం తెలుగుదేశం యువ నాయకుడు టి.జె.ప్రణీత్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని సుధ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి సుధ కుటుంబానికి తనవంతు 5 వేలు సాయం అందించారు. ఆయనతో పాటు నెల్సన్ మండేలా, సుధ, సుబ్రమణి, తెలుగుదేశంనాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## నేడు జప్తు చేయబడిన వాహనాలు బహిరంగ వేలం

తిరుపతిరూరల్, మార్చి23 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ నేరముల కింద జప్తు చేయబడిన వాహనాలను 24న బహిరంగ వేలం వేస్తున్నట్లు సి.ఐ. నరసానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో రేణిగుంట రోడ్డులో వున్న ఐఎంఎల్ డిపో వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆ సక్తి కలిగినవాళ్ళు తిరుపతిరూరల్ ఎక్సైజ్ స్టేషన్ సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 9440902543 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# రణ భేరి 3.0 నిరాహార దీక్షను విజయవంతం చేయండి..

## ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల కు యుటిఎఫ్ పిలుపు..

పెనగలూరు మార్చి 23 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గం పెనమలూరు మండలం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి 3.0 పోరాటం లో భాగంగా రైల్వే కోడూరు అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద రేపు 24 వ తేదీ మంగళవారం జరిగే నిరాహార దీక్ష ను విజయవంతం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు పెనగలూరు మండలం చక్రంపేటలో ప్లకార్డులు విడదల చేయడం జరిగింది. నియోజకవర్గం పరిధిలోని రైల్వే కోడూరు, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారి పల్లి, చిట్వేలు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. 12 వ పి ఆర్ సి కమిటీ ని నియమించి 29 ఐ ఆర్ ను వెంటనే ప్రకటించాలని, 4 పెండింగ్ డి ఏ లు విడుదల చేయాలని, మెమో 57 అమలు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీమ్ ను అమలు చేయాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబాల వారికి కారుణ్య నియామకాలు చేపట్టాలని తదితర డిమాండ్లు కోరుతూ ఈ నిరాహార దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే యుటిఎఫ్ ఆధ్వర్యంలో రెండు సార్లు రణభేరి పోరాటాలు మరియు వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమం లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. హరి ప్రసాద్, పెనగలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాస్ కుమార్, యం. నరసింహారావు, ఆధ్యక్షులు యం. సతీష్, ఆడిట్ కన్వీనర్ జె. సురేంద్ర, జిల్లా కౌన్సిలర్లు జి. సురేంద్ర, పి. విజయ్ కుమార్, ఉపాధ్యాయులు యం. చంద్ర మోహన్, కె.శ్రీరాములు, యు. వెంకట సుబ్బయ్య, ఆర్.సుబ్రహ్మణ్యం, జి. ప్రసన్న లక్ష్మి, పి. షబానా తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి డివిజన్

## రైతులకు అండగా ఉంటాం - ఎఎంసి ఛైర్మన్ రాజన్న



వి.కోట, మార్చి 23 ప్రభాతవార్త: రైతులకు తాము అండగా ఉంటామని పలమనేరు ఎఎంసి ఛైర్మన్ రాజన్న పేర్కొన్నారు. వి.కోట మార్కెట్ యార్డులో జరుగుతున్న పరిణామాలపై రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వి.కోట మార్కెట్‌లో పాతుకుపోయిన కొందరు సిండికేట్ వ్యాపారులు దౌర్జన్యాలకు పాల్పడి సాటి వ్యాపారులను బూతులతో దూషించిన సంఘటన వెలుగు చూసింది. దీనిపై విచారణ చేపట్టేందుకు ఎఎంసి ఛైర్మన్ రాజన్న, మార్కెట్ కార్యదర్శి సంజీవయ్య, స్థానిక నేతలు సమావేశం జరిపారు. ట్రేడర్స్ ప్రభుత్వ నిబంధనలకు లోబడి రైతులకు మేలు చేసేలా నడుచుకోవాలని ఛైర్మన్ సూచించారు. మార్కెట్ యార్డులో గొడవలకు కారణమైన వారిని విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యను సామరస్యంతో పరిష్కరించి రైతులకు మేలు కలిగిస్తామన్నారు. అలాగే ఈ ఘటనపై మార్కెటింగ్ శాఖ ఎడి పరమేషన్ విచారణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ రామచంద్రనాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, టిడిపి మండల అధ్యక్షుడు రాంబాబు, పిఎసిఎస్ ఛైర్మన్ నారాయణస్వామి, రైతులు, ట్రేడర్ల యజమానులు పాల్గొన్నారు.

## లబ్దిదారుల ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలి:తహశీల్దార్

కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త : రేషన్ లబ్దిదారుల ఇకెవైసి కార్యక్రమంను చౌక దుకాణ డీలర్లు త్వరగా పూర్తి చేయాలని తహశీల్దార్ చిట్టిబాబు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో మండల చౌక డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకెవైసి చేయడంలో



జిల్లాలో చివరిస్థానంలో మండల డీలర్లు ఉన్నారన్నారు. త్వరగా ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అలాగే లబ్దిదారులకు బియ్యం, చక్కెర, గోధుమలను సకాలంలో అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిత్యావసరాల పంపిణీపై ప్రజలనుంచి అభిప్రాయ సేకరణ చేపడుతుందనే విషయం డీలర్లు మరువరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సమావేశంలో డీలర్ల సంఘ అధ్యక్షుడు వేణుగోపాల్, డీలర్లు పాల్గొన్నారు.

## వైకాపా నుంచి తెదేపాలోకి చేరికలు



కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి ఐదవ వార్డుకు చెందిన పలువురు వైకాపా నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం వీరు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో తెదేపాలో చేరారు. ఈసందర్భంగా ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి తాము తెదేపాలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## లోక కళ్యాణం కోసం త్రిమూర్తుల కళ్యాణం



తిరుపతి,మార్చి 23 ప్రభాతవార్త: లోకక్షేమం, ప్రపంచ శాంతి సాధనార్థం మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంగా త్రిమూర్తుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీ తెలిపారు. ఈ పవిత్ర మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను తిరుపతిలోని నేరేళ్లమ్మ ఆలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీ మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం, కమ్మ కండ్రిగ గ్రామ సమీపంలో స్వయంభు వు గా వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయంలో చైత్ర పౌర్ణమి సందర్భంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించబడు తుందని తెలిపారు.ఈ దివ్య కళ్యాణ మహోత్సవం ద్వారా లోకకళ్యాణం, శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పాలని సంకల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసే భక్తులకు నిరంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. త్రిమూర్తుల కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో వీక్షి ంచిన వారికి మోక్షప్రాప్తి కలుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పుణ్య సందర్భాన్ని సద్వినియోగం చేసుకుని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దైవ అనుగ్రహం పొందాలని ప్రతాప్ స్వామీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త చాణక్య ప్రసాద్, రంగస్థలి కార్యదర్శి కేవన్ రాజు, సభ్యులు సురేష్ రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి,పురోహితుడు సురేష్ స్వామి, డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభం, విజయభాస్కర్ రెడ్డి, విగ్రహాల కళ్యాణి, కొట్టే సుబ్రహ్మణ్యం, మిట్టపల్లి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు పెంపుకు మరో పోరాటానికి సిద్ధమవుతున్న అంగన్‌వాడీలు

కేవీబీ పురం, మార్చి 23 ప్రభాతవార్త: అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు, హెల్పర్స్ ప్రమోషన్ గైడ్ లైన్స్ జీవో 5లో సవరణ చేయాలని, గ్రాట్యూటి అమలు, మే నెల మొత్తం వేసవి సెలవులు, ఇతర సమస్యల పోరాటం కొనసాగించాలని మార్చి 22వ తేదీ ఎంబీవీకేలో సి.హెచ్.సుప్రజ అధ్యక్షతన జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. సోమవారం కేవీబీ పురంలో జరిగిన కమిటీ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాలు సందర్భంగా అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని, ఇతర సమస్యల పరిష్కారం చేయాలని తెలిపారు. మార్చి 10వ తేదీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చర్చలకు యూనియన్ నాయకులను పిలిచారు. దీంతో వేతనాలు పెంచుతారేమో అన్న ఆశతో అంగన్‌వాడీ ఉద్యోగులందరూ వేతనాలు పెంచుతారేమో అని చాల ఆశగా ఎదురు చూశారు. కానీ ఆశల మీద నీరు చల్లి గౌరవ ముఖ్యమంత్రితో మాట్లాడి చెబుతామని మొండి చేయి చూపారు. ఉగాదితరువాత అయిన ప్రభుత్వం ఆలోచన చేసి వేతనాలు పెంచుతారేమో అని ఎదురు చూశామని, ఎటువంటి స్పందన లేదన్నారు. అంగన్‌వాడీ 42 రోజులు సమ్మె సందర్భంగా ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, పైగా పోరాటం చేస్తే వేతనాలు కట్ చేస్తామని బెదిరింపులు చేస్తున్నారని వాపోయారు. సమావేశంలో ఎం.నాగేషు, కార్యదర్శి ఎన్.సి.హెచ్.సుప్రజ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోశాధికారి బి.లక్ష్మీదేవి, రాష్ట్ర నాయకులు చంద్రావతి, కృష్ణవేణి, రమాదేవి, నిర్మల, భాగ్యలక్ష్మి, బేబిరాణి, సుధారాణి, కుమారి, కోకిల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి సదరన్ స్లాట్ బుకింగ్ ప్రారంభం

శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త: దివ్యాంగులకు ప్రభుత్వం శుభవార్త తెలిపిందని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.దివ్యాంగులకు ఇదో శుభవార్త అన్నారు.మార్చి 25 నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. దివ్యాంగులకు మార్చి 30 నుంచి వైద్యపరీక్షలు ప్రారంభమౌతుందన్నారు.డిజిటల్ సర్టిఫికేట్ జారి చేస్తారని 40శాతం వైకల్యం ఉన్న వారికి పెన్షన్‌తో పాటు ఉచిత బస్సు సదుపాయం ఉంటుందన్నారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ తెలిపారు.

## పోరాటాల వేగు చుక్క భగత్ సింగ్



శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త: పోరాటాల,ఉద్యమాల వేగు చుక్క భగత్ సింగ్ అని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో భగత్‌సింగ్,సుఖదేవ్‌ల వర్ధంతిని సోమవారం నిర్వహించారు. చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో భగత్ సింగ్ వేగుచక్కగా నిలిచాడన్నారు. కమ్యూనిస్టు విప్లవ స్ఫూర్తితో బ్రిటిషర్లకు ఎదురొడ్డి పసితనంలోనే ఆశువులు బాసారన్నారు.ఆయన స్ఫూర్తిగా సమాజ స్థాపనకు నేటి యువతకు నడుం కట్టాలని సూచించారు. ముఖ్యంగా మత్తు, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గురునాథం, రాపూరు సుబ్రమణ్యం, ఉస్మాన్ బాషా, కే.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వరికి గిట్టుబాటు ధర కల్పించాలి!

**-కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

**-మూతపడ్డ చక్కెర ఫ్యాక్టరీలు తెరిపించాలి!**




శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్లక్ష్యం చేస్తుందని ఈ ధోరణి మారాలని రెండు రోజుల పాటు ఇక్కడి పుచ్చల పల్లి సుందరయ్యభవన్‌లో జరిగిన తిరుపతి జిల్లా రైతు మహాసభల్లో వక్తలు డిమాండ్ చేసారు.సోమవారం జరిగిన సభల్లో వక్తలు మాట్లాడుతూ నేడు రైతాంగం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. తిరుపతి జిల్లాలో వరి రైతులు రాష్ట్రంలోని పత్తి,మిరప రైతుల పరిస్థితి దీనాతి దీనంగా మారిందన్నారు. రైతులు గిట్టుబాటు ధరల్లేకుండా తల్లడిల్లుతుంటే పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా రెండు రోజుల సమావేశాల్లో పలు కీలక తీర్మానాలు చేసారు. తిరుపతి జిల్లాలో వరి పండించిన రైతులకు వెతలే మిగులుతున్నాయని వివరిస్తూ ప్రభుత్వం గిట్టుబాటు దరలను ప్రకటించి నామమాత్రంగా ఉన్న కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని తీర్మానించారు.కొత్తగా కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతి జిల్లాలో రైతులు వాణిజ్యపంటలుగా పండించిన చెరకును స్వీకరించిన మయూర్ షుగర్స్,నేతమ్స్ షుగర్స్ రైతుల నుంచి చెరకును సేకరించి వారికి సొమ్ములు చెల్లించక ఫ్యాక్టరీలను మూసి వేసి రైతులను చావుదెబ్బ కొట్టారని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని రైతులను కాపాడాలని అలాగే వాణిజ్యపంటలను ప్రోత్సహించాలని కోరారు. అలాగే ఫ్యాక్టరీలు బకాయి ఉన్న సొమ్మును రైతులకు తిరిగి ఇప్పించాలని లేదా రైతు భవిష్యత్తు కోసం వారి కుటుంబాలను ఆదుకొనుటకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానించారు. ఏనుగుల వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతుల పంటలు నష్టపోతున్నాయని వాటి వల్ల ప్రమాదం లేకుండా కాపాడాలని సమావేశం మరో తీర్మానం చేసారు. ఈ ప్రాంతాల్లో మామిడి సాగు విస్తారంగా సాగుతుందని కొనుగోలుకు ప్రత్యేకంగా మామిడి బోర్డు ను ఏర్పాటు చేయాలన్నారు. గుజ్జు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం బడుల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులకు అందించే మెనులో మామిడి జ్యూస్‌ను చేర్చాలని కోరారు.ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తూ తిరుపతి దాహార్తి తీర్చే సోమశిల-స్వర్ణముఖి కాలువను పూర్తి చేసి రైతులకు సాగునీరు తిరుపతికి వచ్చే భక్తులకు మంచినీరు అందించాలని మరో తీర్మానం చేసారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 22ఏ భూ సమ్యలు చోటు చేసుకున్నాయని, ప్రభుత్వం సేకరించే భూములకు న్యాయమైన పరిహారం చెల్లించాలని సమావేశం తీర్మానించింది.

## రామాపురం వద్ద గుప్త నిధుల కోసం పూజలు

**-ఇద్దరు యువకులను అదుపులో తీసుకున్న పోలీసులు**



శ్రీకాళహస్తి రూరల్,మార్చి 23 ప్రభాతవార్త: శ్రీకాహస్తి పట్టణానికి సుమారు 10కిలో మీటర్ల దూరంలోని రామాపురం మంచినీటి రిజర్వాయర్ వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా ముందుగా అందిన సమాచారం మేరకు రూరల్ సిఐ ఇబ్రహీం వారి సిబ్బంది అక్కడకు చేరుకొని ఇద్దరిని అదుపులో తీసుకున్నారు. తవ్వకానికి ఉపయోగించిన పేలుడు పదార్థాలు, వాహనాన్ని అదుపులో తీసుకున్నట్లు సోమ వారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐ ఇబ్రహీం వివరించారు. ఆయన వివరించిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీకాళహస్తీశ్వరునికి సంబంధించి కైలాసగిరి పర్వత పంక్తులు సుమారు 22 కిలో మీటర్లు విస్తరించి ఉన్నాయి. ఇందులో ఎన్నో పురాతన కాలం నాటి ఆలయాలు ఉన్నాయి.ఈ ప్రాంతాలను రాజులు పరిపాలించినట్లు ఆనవాలున్నాయి.

గతంలో కూడా వెయ్యి లింగాల కోనలో వెలసిన లింగాన్ని కూడా కొందరు గుప్త నిధులు కోసం తవ్వినట్లు తనకు ఆ ప్రాంతం వారు తెలిపారని సిఐ వివరించారు.ఈ నేపథ్యంలో దేవస్థానంకు అనుబంధంగా ఉన్న అంజూరు వారి మండపానికి సుమారు 1.5కిలో మీటర్ల దూరంలోని తిరుపతికి మంచినీటిని సరఫరా చేసే రామాపురం రిజర్వాయర్ సమీపంలో గుప్త నిధులున్నట్లు కొందరు తవ్వకాలు జరుపుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోమవారం ఉదయం అక్కడ తవ్వకాలు జరుపుతున్న స్థలంలో పరిశీలించగా తవ్వకాల్లో పెద్ద బండరాయి పడటంతో తవ్వకాలు జరుపుతున్న వారు తొట్టంబేడు మండలం తంగేళ్ళ పాళెం గ్రామానికి చెందిన శేఖర్ తిరుపతికి చెందిన నాగరాజు అనే వ్యక్తిని అదుపులో తీసుకున్నట్లు వివరించారు.

వారు జిలెటిన్ స్టిక్స్ తెచ్చి పేల్చి ఆ బండరాయిని పగల గొట్టి గుంత తవ్వుతుండగా గుర్తించి అదుపులో తీసుకున్నట్లు సిఐ ఇబ్రహీం వివరించారు. అదుపులో తీసుకున్న వారిలో శేఖర్, నాగరాజులను అరెస్టు చేసి వారు ఉపయోగించిన 20జిలిటిన్స్ స్టిక్స్ బ్యాటరీ,వైర్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జి.ఇబ్రహీం వివరించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు,ఇంకెక్కడ తవ్వకాలు జరుపుటకు నిర్ణయించారో అని విచారణ జరుపుతున్నట్లు వివరించారు.

## మోహన్‌బాబు యూనివర్శిటీ విద్యార్థి మిస్సింగ్!

**తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు**



చంద్రగిరి, మార్చి 23 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఏ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్శిటీలో 4వ సంవత్సరం ఇంజినీరింగ్ చేస్తున్న వి.అదిల్ జయవంత్ కనిపించడంలేదని సోమవారం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరుకు చెందిన వి.జయప్రకాష్ రావు రెండవ కుమారుడు అదిల్ జయవంత్ ల్యాప్ టాప్ కోసం రూ.30 వేలు పంపమని కోరాడు. అయితే రెండు రోజుల్లో సమకూర్చగలనని తండ్రి చెప్పినప్పటికీ కలత చెందిన అధిల్ జయవంత్ ఆదివారం తన మొబైల్ స్విచాఫ్ చేసి ఫ్రెండ్‌కు అప్పగించి కనిపించకుండా వెళ్ళిపోయాడు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు సోమవారం హాస్టల్ వద్దకు చేరుకుని తమ కుమారుడి ఆచూకీ కోసం విచారణ చేశారు. అక్కడి నుండి చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమ కుమారుడు కనబడుట లేదని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎన్‌టిఆర్ పార్కులో సమస్యలను పట్టించుకోండి!



శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ఒకే ఒక పార్కు, పానగల్‌లోని మున్సిపల్ ఎన్‌టిఆర్ పార్కు. ఈ పార్కుకు ఉదయం, వేకువ జామున వాకర్స్ చాలామంది వస్తున్నారు. అలాగే పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ఒకే ఒక పార్కులో పలు సమస్యలుచోటు చేసుకుంటున్నాయి. వాటిని పరిష్కరించాల్సిన మున్సిపాలిటి నిర్లక్ష్యం వహిస్తుందనే విమర్శలు చోటు చేసుకున్నాయి. పార్కులులో పచ్చదనం కనుమరుగు అవుతున్నది. ఇక్కడ జారుడుబల్ల, ఉయ్యాల, పుట్పాత్ పక్కనే విద్యుత్ పోల్‌కు సంబంధించిన విద్యుత్ వైరు తెగిపడగా దానికి జాయింట్ వేసి వదలిపెట్టారు. రోజుకు ఇక్కడకు సుమారు 1500 మంది తల్లిదండ్రులు తమ పిల్లలతో వస్తుంటారు. కానీ ఇక్కడ పొంచి ఉన్న ప్రమాదం ఎప్పుడు ఏ విధంగా పరిణమిస్తుందో అంతుపట్టని విధంగా ఉంది.పొరబాటును పిల్లలు పట్టుకుంటే ఇక ఊహాతీతం. అధికారులు ఇక్కడి పార్కు పరిస్థితి ఏమిటి? ఇక్కడ కాంట్రాక్టర్ ప్రజలకు, పిల్లలకు కల్పిస్తున్న సదుపాయాలేమిటి? అనే అంశాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా రైతు సంఘ కమిటి ఎంపిక




శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని పుచ్చల పల్లి సుందరయ్య భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర రైతు సంఘ సమావేశంలో సోమవారం ముగింపు సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సిపిఎం ప్రకటించింది. రైతు సమస్యల పట్ల అవగాహన కల్గిన కార్యకర్తలను ఎన్నుకున్నారు. నేడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుటకు రైతులు,అధికారులకు వారధిగా వ్యవహరించాలని కోరారు. కమిటి అధ్యక్షులుగా అంగేరి పుల్లయ్య, ప్రధానకార్యదర్శిగా పి.హేమలత, కోశాధికారిగా ధనంజయులను ఎన్నుకున్నారు. కాగా ఉపాధ్యక్షులుగా కె.రంగయ్య, మునిరామయ్య, సహాయ కార్యదర్శులుగా పి.మణి, వెంకట్రామరెడ్డి, చెన్న కేశవులు, నాగరాజు, హరి ప్రసాద్, సిద్దమ్మ,జజయదేవయ్య, రాము, మనోహర్, శివయ్య,చంద్రకుమార్, వెంకటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ప్రకటించింది.

## ముస్లిం శ్మశానికి స్థలం కేటాయింపు

**-ఎంఎల్ఏ చొరవకు ముస్లిం ధన్యవాదాలు**



ఏర్పేడు,మార్చి 23 ప్రభాతవార్త: ఏర్పేడు మండల కేంద్రంలో ముస్లిం శ్మశానికి ప్రత్యేకంగా స్థలాన్ని రెవెన్యూశాఖ కేటాయించింది. ఇక్కడ ముస్లిలు పడుతున్న అవస్థలను వారం క్రితం ఏర్పేడు మండల కేంద్రానికి చెందిన పలువురు ముస్లిలు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వవెంకట సుధీర్‌రెడ్డిని కలసి తమ బాధలను విన్నవించుకున్నారు.ఆయన వెంటనే మండల రెవెన్యూ అధికారికి చరవాణి ద్వారా మండల కేంద్రంలోని మైనారిటి ముస్లింలకు శ్మశానికి స్థలం కేటాయించాలని ఆదేశించారు.ఈ మేరకు సోమవారం రెవెన్యూ అధికారి వారి సర్వేయర్లు సబ్‌స్టేషన్‌కు సమీపంలో సర్వే జరిపి ప్రభుత్వ స్థలం ఉండగా 10 ఎసెంట్లు ముస్లిల శ్మశానికి కేటాయిస్తూ స్థలాన్ని ముస్లిం పెద్దలకు అప్పగించి,హద్దులను చూపారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి,ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మల చొరవకు ధన్యవాదాలు తెలిపారు. తమ సామాజిక వర్గానికి శ్మశానం స్థలం కేటాయింపుకు సహకరించిన మండల ఇన్‌చార్జి పేరం నాగరాజు నాయుడు మహిళా నాయకురాలు కృష్ణవేణి తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మండల కేంద్రాన్ని మూసేసిన ఫ్లెక్సీలు



తొట్టంబేడు,మార్చి 23ప్రభాతవార్త: శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డులోని శ్రీకాళహస్తి మున్సిపల్ సరిహద్దుల్లో ఉన్న తొట్టంబేడు మండల పరిషత్, రెవెన్యూ పంచాయతీ రాజ్, అటవీ,ఐసిడియస్ సము దాయాన్ని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు మూసిఎ ేసాయి. దాంతో మండల కార్యాలయాలకు ఎవరైనా కొత్త వారు వస్తే ఎక్కడున్నాయో వెతుక్కుంటున్నారు. సాధారణంగా ఏదైనా కార్యక్రమాలు ఉన్నపుడు రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవటం తరువాత రెండు మూడు రోజుల్లో తీసివేయటం జరుగుతుంది. కానీ తొట్టంబేడు మండల కార్యాలయాల సముదాయాల వద్ద నెలల తరబడి అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం, అధికార పార్టీకి సంబంధించినవి కావటంతో అధికారులు కూడా పెదవి విప్పటం లేదు. ఇప్పటికైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్న వారు సామాజిక భద్రత దృష్ట్యా వాటిని తొలగిస్తే బాగుటుందని పరిశీలకులు చెబుతున్నారు.

## రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త: ప్రభుత్వం రేషన్ కార్డుల జారికి నిబంధనలు సులభతరం చేస్తూ ఉత్తర్వులు జారి చేసినట్లు సమాచారం.ఈ మేరకు ముత్యాలమ్మగుడివీధిలోని మీ సేవా కేంద్రంలోన మోదుకు అవకాశం కల్పించినట్లు మీ సేవా నిర్వాహకులు సూరి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సదవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త రేషన్ కార్డు కు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే కుటుంబసభ్యుల చేర్పులు, తొలగింపులు, అలాగే చిరునామా మార్పులు, ఆధార్ లింక్ వెళ్లిపోయిన వారికోసం స్ప్లింగ్‌కార్డు కోసం అవసరమైన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రామమందిరం కుంబాభిషేక పూజలు ప్రారంభం



శ్రీకాళహస్తి రూరల్,మార్చి 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో దేవాదాయశాఖ గ్రామస్థుల భాగస్వామ్యంతో సుమారు 2.5కోట్లతో నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి ఆలయం కుంబాభిషేకం, విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమాలను సోమవారం నిర్ణయించిన మూహూర్తం మేరకు శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి మండలంలోని ప్రదాన పంచాయతీల్లో ముచ్చివోలు ఒకటి.సోమవారం ఉదయం నుంచి ఆలయ కుంబాభిషేక కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి చోటు చేసుకుంది. ఉదయం భగవత్ ప్రార్థనలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనుజ్ఞ, విష్వక్సేన పూజ, పుణ్యావాహచనం, రక్షా బంధన పూజలు, పంచగవ్యారాధన,రుత్విక్ వరణం, పంచగవ్యారాదన, రక్షాధారణ, పంచగవ్య ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామంలో పటాలను ఊరేగింపు జరిపారు. సాయంత్రం విశ్వక్సే న పూజలు, పుణ్యావహాచనం, మృత్యుంగ్రహణం, శాల వాస్తు, అంకురార్పణ సర్వ అగ్నికండేషు, అగ్ని ప్రతిష్ట, ఆకల్మష హోమం, కుంబారాధన,ఉక్త హోమం, లఘు పూర్ణాహుతి,చతుర్వేద పఠనం, హారతులు నిర్వహించారు. కాగా రాత్రి గ్రామంలో రంగస్థల కళాకారులచే శ్రీరామంజనేయ నాటకం ప్రదర్శన ఆకట్టుకుంది.

## పక్కాగా పారిశుధ్యం పనులు

**- మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం**



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త: పారిశుధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దని, పక్కాగా పారిశుధ్య పనులు చేపట్టి చిత్తూరు నగరంను సుందరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ సోమవారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌తో కలిసి నగర పరిధిలో పలు చోట్ల జరుగుతున్న పారిశుధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాజూరులోని ఇళ్ళ నుండి పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్త సేకరణను కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని అన్ని డివిజన్లలో తడి, పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. అలాగే కమీషనర్ వేలూరు రోడ్డు, గిరింపేట, పాత కలెక్టరేట్ రోడ్డు, కాజూరు సర్కిల్, ఇరువారం హైవే ప్రాంతాలను పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు తగిన ప్రణాళిక రూపొందించి ఆ మేరకు పక్కాగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. ప్రధాన రహదారులు, రోడ్లకు ఇరువైపులా ఎక్కడా చెత్త కుప్పలు కన్పించకూడదని ఆదేశించారు. ఉదయం 7.30 గంటలలోపు రోడ్లు, వీధుల శుభ్రత పూర్తి చేయాలన్నారు. అలాగే డంపర్ బిన్లలోని వ్యర్థాలను సైతం సకాలంలో తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులకు సంబంధించి ఎక్కడా నిర్లక్షం వహించకుండా ఎప్పటికప్పుడు పనులు చేపట్టి పూర్తి చేయాలని శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలను కమీషనర్ ఆదేశించారు.

## నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

**- యర్రావారిపాలెంలో కొత్త పరిశ్రమ ప్రారంభం**



యర్రవారిపాలెం, మార్చి 23 ప్రభాతవార్త: యర్రావారిపాలెంలోని మారుమూల గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు శ్రీదేవి బేవరేజెస్ కంపెనీ ప్రొపరేటర్ జీవన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీదేవి బేవరేజస్ కంపెనీ ఆధ్వర్యంలో గోలి సోడా, వాటర్ బాటిల్, జీరా, బాదం పాలు తయారీ యూనిట్‌ను ఈ నెల 28వ తేదీన ప్రారంభిం చనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాల కొరత కారణంగా అనేక మంది యువత నగరాలకు వలస వెళ్తున్న నేపథ్యంలో, స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ప్రారంభం ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా యర్రావారిపాలెం మండలంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు, అవసరమైన వారికి శిక్షణ కూడా అందిస్తామని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇటువంటి చిన్నతరహా పరిశ్రమలు ఎంతో దోహదపడతాయని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ఈ పరిశ్రమ విజయవంతమైతే, మరిన్ని కంపెనీలు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**- ఉద్యోగాలు ఇవే.. దరఖాస్తు చేసుకోండి..**

శ్రీదేవి బేవరేజస్ కంపెనీలో 35 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని అన్నారు. రిసెప్షనిస్ట్, మేనేజర్స్, వాచ్మెన్, డ్రైవర్, వర్కర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్లీనర్ లకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కంపెనీ ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లా, సత్యసాయి జిల్లాల్లో గోలి సోడా, బాదంపాలు, వాటర్ బాటిల్స్, జీరా జ్యూస్‌లను మార్కెటింగ్ చేయడం జరుగుతుందన్నారు.

## మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త : మండలంలోని నడిమూరు వద్ద ఉన్న ఏపి మోడల్ స్కూల్ కాలేజ్‌లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ కోరారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి కోర్సుల్లో చేరవచ్చన్నారు. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు గాను ఓసి,బిసి, ఇడబ్ల్యుఎస్‌లకు రూ 200, ఎస్సీ,ఎస్టీలకు రూ 150లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. టెన్త్‌లో మెరిట్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా సీట్ల భర్తీ చేపట్టడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.